ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 30 అక్టోబరు 2024 | 7





మనకూ ఉన్నాయ్.. శివకాశీలు!

- ఉమ్మడి జిల్లాలో బాణసంచా తయారీ
- ప్రతి జిల్లాలోనూ ప్రధాన కేంద్రాలు
- ఏడాదంతా వేలాది మందికి ఉపాధి
- శివకాశీని తలదన్నే ఉత్పత్తులు

బాణసంచా అంటే ప్రతి ఒక్కరి నోటా వినిపించే మాట శివకాశీ.. ఎందుకంటే అక్కడ మందు గుండు సామగ్రి నాణ్యతగా ఉంటుందనేది ప్రతి ఒక్కరి మాట.. నేటికీ శివకాశీ మాట వినిపించకుండా దీపావళి పండుగ జరగదు.. బాణసంచా అంటే శివకాశీ ఒకటే కాదండోయ్.. మన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోనూ అటువంటి ప్రాంతాలు జిల్లాకో పది వరకూ ఉంటాయి.. అవెక్కడో ఉన్నాయనుకుంటున్నారా.. ఒక్కసారి బాణసంచా తయారు చేసే ప్రధాన ప్రాంతాలేంటో తెలుసుకుంటే.. ఇక్కడా అని ఆశ్చర్యపోవడం మీవంతవుతుంది.. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెం.. కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం.. రామచంద్రాపురం మండలం ద్రాక్షారామం, జువ్విపాడు ఇలా చెప్పుకుంటూ పోతే బాణసంచా తయారీనే ఉపాధిగా మలుచుకున్న గ్రామాలెన్నో ఉన్నాయి. ఒక పక్కన ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నా.. దశాబ్దాలుగా వేలాది మందికి అదే ఉపాధి.. అధికారికంగా తయారీ కేంద్రాల లెక్క పదుల సంఖ్యలో ఉంటే.. అనధికారికంగా ఈ లెక్క వందల్లో ఉంటుందనేది అధికారులెరిగిన సత్యం. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆనందమైనా.. బాధయినా.. ఉత్సవమైనా.. జాతరైనా.. రాజకీయ మీటింగ్ అయినా చివరికి పుట్టినరోజు అయినా కూడా మందుగుండు సందడి చేయాల్సిందే మరి.. అందుకే ఏడాదంతా మూడు బాంబులు.. ఆరు చిచ్చుబుడ్లుగా ఈ వ్యాపారం సాగుతూనే ఉంటుంది.. రేపు దీపావళి పండుగ సందర్భంగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తయారీ కేంద్రాలపై ప్రత్యేక కథనం.. - వివరాలు 8లో



డీఈవోగా షేక్ సలీంబాషా బాధ్యతల స్వీకరణ



ముమ్మిడివరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారిగా షేక్ సలీం బాషా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణాజిల్లా అంగళూరు డైట్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న షేక్ సలీం బాషా ఇక్కడికి బదిలీపై వచ్చారు. సలీం బాషాకు కార్యాలయ ఉద్యోగులు, ప్రధానోపాధ్యాయ సంఘ నాయకులు, వ్యాయామోపాధ్యాయ నాయకులు, మండల విద్యాశాఖ అధికారుల, అసోసియేషన్ పలు ఉపాధ్యాయ సంఘ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం విద్యాశాఖ కార్యాలయంలో డీఈవో సలీంబాషా, ఉప విద్యాశాఖాధికారులు, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. విద్యాపరంగా జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఉప విద్యాశాఖాధికారులు శ్రీపాద లక్ష్మీనరసింహఫణి, గుబ్బల సూర్యప్రకాశరావు, మండల విద్యాశాఖాధికారుల అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బొజ్జా రమణశ్రీ, సెక్టోరియల్ బీపీవీ సుబ్రహ్మణ్యం, బి.రమేష్, పి.రాంబాబు, డాక్టర్ ఎంఏకే భీమారావు, ఎంపీపీ సత్యనారాయణ, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, మోకా ప్రకాష్, విత్తనాల శ్రీనివాస్, ఆర్.ఉదయభాస్కర్, ఎస్.గణేశ్వరరావు, బి.శ్రీనివాస్, పల్లయ్యశర్మ, ఉదయభాస్కర్, తాడిశ్రీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

బ్లాక్ స్పాట్లు గుర్తించి ప్రమాదాలను నివారించాలి

కలెక్టర్ మహేష్‌కుమార్



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రహదారి ప్రమాదాలు పొంచి ఉన్న ప్రాంతాలపై అనుబంధ శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నివారణా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. జిల్లాలో తరచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ జంక్షన్లను గుర్తించి ఇంజనీర్ల సహకారంతో నివారణా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. గత సమావేశంలో తీర్మానించిన అంశాలపై కమిటీ సభ్యులు తీసుకున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఇంటిగ్రేటెడ్ రోడ్ యాక్సిడెంట్ సెంట్రల్ పోర్టల్‌లో గత మూడు నెలలుగా నమోదైన ప్రమాదాల సంఖ్య తీవ్రతలను, సంబంధిత అధికారులు తీసుకున్న నివారణా చర్యలను తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు మార్జిన్లను బలోపేతం చేయడంతో పాటు మలుపుల వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా నివారణా చర్యలు చేపట్టాలన్నారు. హై మాస్క్ లైటింగ్ ఏర్పాటు, స్పీడ్ బ్రేకర్లు, రేడియం స్టిక్కర్ల వంటి ఏర్పాట్లపై చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట్ల వైద్య ఆరోగ్యశాఖ ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలల్లో రహదారి భద్రతా క్లబ్‌లు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్‌ల వద్ద పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రహదారుల అథారిటీ ఆఫ్ ఇండియా టెక్నికల్ మేనేజర్ అమిత్ అన్సారీ, ఆర్అండ్‌బీ ఎస్ఈ బి.రాము, డీసీహెచ్ఎస్ కార్తీక్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావుదొర, జాతీయ రహదారులశాఖ అధికారులు పాల్గొన్నారు.

నవంబరు మొదటి వారంలో నైపుణ్య గణన

అమలాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నైపుణ్య గణన కార్యక్రమం మార్గదర్శకాలకు అనుగుణంగా పటిష్టంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి చెప్పారు. సచివాలయ సిబ్బందితో నవంబరు మొదటి వారం నుంచి జిల్లాలో నైపుణ్య గణన ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. నైపుణ్య గణనకు జిల్లాస్థాయిలో ఎన్యూమరేటర్లకు మొదటి విడత శిక్షణా కార్యక్రమం మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఒక్కో మండలం నుంచి ఇద్దరు చొప్పున పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థల నుంచి ఎనిమిది మందిని నియమించి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇప్పటికే నైపుణ్య గణన ప్రాజెక్టును మంగళగిరి నుంచి శ్రీకారం చుట్టారన్నారు. సచివాలయాల పరిధిలో నైపుణ్య గణన సేకరణకు సంబంధించి లాగిన్‌లు ఇచ్చామన్నారు. ఎన్యూమరేటర్లు ప్రతీ ఇంటికి వెళ్లి ఆ కుటుంబంలో పదిహేను సంవత్సరాల నుంచి 59 ఏళ్ల మధ్య వయసు గలవారి వివరాలను సేకరించడంతో పాటు వారి ఆసక్తికి అనుగుణంగా ఎటువంటి ఉద్యోగం, శిక్షణ, స్వయం ఉపాధి, సొంత వ్యాపారం అవసరమా అనే కోణంలో వివరాలు నమోదు చేస్తారు. ఇందుకోసం ప్రత్యేక ప్రశ్నావళిని రూపొందించామన్నారు. ఎనిమిది సెక్టార్లలో 85 ప్రశ్నలతో ప్రశ్నావళిని పూర్తి వివరాలతో నింపాల్సి ఉంటుందన్నారు. గ్రామ సచివాలయాలు, స్కిల్ డెవలప్‌మెంట్, సీడాప్, న్యాక్ విభాగాల సిబ్బంది నైపుణ్య గణన కార్యక్రమంలో పాలు పంచుకుంటారు. కార్యక్రమాన్ని స్కిల్ డెవలప్‌మెంట్ హెడ్ క్వార్టర్స్ నుంచి నిరంతరం పర్యవేక్షిస్తారన్నారు. వచ్చే ఐదేళ్లలో రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. పాలిటెక్నిక్, ఐటీఐ పాసైన ప్రతీ ఒక్కరు సంస్థ నుంచి బయటికి వచ్చిన వెంటనే ఉపాధి పొందేలా చర్యలు చేపట్టాలని జేసీ ఆదేశించారు. శిక్షణలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరిశేషు తదితరులు పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలు
పారదర్శకంగా నిర్వహించాలి

జాయింట్ కలెక్టర్ నిషాంతి



అమలాపురం టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పునరుద్ధరించిన నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించాలని ఆయా శాఖల సిబ్బందిని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో సాగునీటి సంఘాల ఎన్నికలపై అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ భూ యజమానుల గుర్తింపు, ఓటరు జాబితా తయారీ కచ్చితంగా చేపట్టాలన్నారు. తొలి దశలో నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు రెండో దశలో డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, మూడో దశలో ప్రాజెక్టు కమిటీ ఎన్నికల ప్రక్రియ చేపట్టాలన్నారు. మేజర్ ఇరిగేషన్, మీడియం ఇరిగేషన్, మైనర్ ఇరిగేషన్ విధానాలను తప్పనిసరిగా అనుసరించాలన్నారు. దోషరహిత జాబితాలను రూపొందించాలన్నారు. ప్రాదేశిక నియోజకవర్గాల వారీగా ఎన్నికల ప్రక్రియ నిర్వహించాలని చెప్పారు. మండపేట తహసీల్దార్ తేజేశ్వరరావు అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ ఇచ్చారు. డీఆర్వో వి.మదన్‌మోహనరావు, ఆర్డీవోలు కె.మాధవి, పి.శ్రీకర్, డి.అఖిల, జలవనరుల శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 15,31,897 మంది ఓటర్లు

ముసాయిదా ఎన్నికల జాబితా ప్రచురణ: కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితాను మంగళవారం ప్రచురించినట్టు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 15,31,897 మంది ఓటర్లు ఉన్నట్టు తెలిపారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 షెడ్యూల్‌ను అనుసరించి ఓటరు నమోదుకు నంబరు 28 వరకు గడువు ఇచ్చారు. దీనిలో భాగంగా నవంబరు 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 2025 జనవరి 6న తుది ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. జిల్లాలో మొత్తం 1644 పోలింగ్ కేంద్రాల పరిధిలో 7,59,379 మంది పురుషులు, 7,72,497 మంది స్త్రీలు, 21 మంది ఇతర ఓటర్లు ఉన్నారు.







మనకూ ఉన్నాయ్.. శివకాశీలు!


కొమరిపాలెంలో తయారుచేసిన సెర్చిలైట్లు



దీపావళేకాదు.. మరెన్నో సంబరాలు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా లోని పలు గ్రామాలు బాణసంచా తయారీలో ప్రసిద్ధి చెందాయి. అందులో ప్రధానమైనవి బిక్కవోలు మండలం కొమరిపాలెం, సామర్లకోట మండలం వేట్లపాలెం, రామచంద్రపురం మండలం ద్రాక్షారామ, జువ్విపాడు.. ఇలా పది గ్రామాల వరకు బాణసంచా తయారీ జరుగుతుంది. దాదాపు ఐదు దశాబ్దాల నుంచి ఇదే పరిశ్రమలో కొనసాగుతున్నవారు ఉన్నారు. వందలాది మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. కేవలం దీపావళి కోసమే కాకుండా జాతరలు, ఉత్సవాల సందర్భంలో మందుగుండు కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా జరుగుతాయి. ఈ మందుగుండు కాల్పుల విషయంలో పోటీలు కూడా పెడతారు. అలాగే వివాహాలు, ఇతర కార్యక్రమాలు, రాజకీయ వేడుకల్లో కూడా మందుగుండు కాల్చడం మన ప్రాంతంలో ఆనవాయితీగా ఉంది. దీంతో ఇక్కడ బాణసంచా పరిశ్రమ కొనసాగడానికి ప్రధాన కారణమని చెప్పాలి.

వెలుగు జిలుగుల రంగేళి.. దీపావళి. దివ్వెల పండుగంటే చిన్నాపెద్దా అందరికీ ఆనందమే. ముఖ్యంగా పిల్లలకు ఒక అద్భుత లోకాన్నే వీక్షిస్తున్నట్టు విరజిమ్మే బాణసంచా వెలుగులంటే చెప్పలేనంత సంతోషం. గతంలో బాణసంచా కావాలంటే ఎవరి ఇంటి దగ్గర వాళ్లే సొంతంగా తయారుచేసుకునేవారు. సిసింద్రీలు, చిచ్చుబుడ్లు, తారాజువ్వలు, పటాసులు, నారబాంబులు ఇళ్ల వద్దే నెలరోజుల ముందు నుంచే తయారుచేసేవారు. మిగిలిన బాణసంచా మాత్రం స్థానిక వ్యాపారులు తయారుచేసి అమ్మేవారు. తర్వాత శివకాశీ నుంచి బాణసంచా దిగుమతులు పెరిగాయి. బ్రాండింగ్ పేరుతో అది రెట్టింపు అయింది. అయినప్పటికీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో బాణసంచా తయారుచేసే కేంద్రాల్లో పెద్దఎత్తున మందుగుండు సామగ్రి సిద్ధమవుతోంది. స్థానికంగా తయారుచేసే వీటిని ఇతర ప్రాంతాలకూ ఎగుమతి చేస్తున్నారు. ఏడాది పొడవునా చూస్తే ఈ వ్యాపారం కోట్లలోనే సాగుతోంది. ఇందులో దశాబ్దాల తరబడి బాణసంచా తయారీలో పేరొందిన గ్రామాలున్నాయి. ప్రాణాపాయం ఉన్నప్పటికీ ఇదే జీవనాధారంగా చేసుకున్న వందలాది మంది కార్మికులు ఉన్నారు. మన ప్రాంతంలో బాణసంచా తయారీ సంస్థలపై ప్రత్యేక కథనం.

ఓ వెలుగు వెలిగి..

(ఆంధ్రజ్యోతి- మండపేట/యు.కొత్తపల్లి)

మందుగుండు సామగ్రి తయారీలో మండపేట కూడా ప్రసిద్ధి. ఇక్కడ తయారయ్యే బాణసంచా రాష్ట్రవ్యాప్తంగా ఎగుమతులు జరిగేవి. తర్వాత వరుస ప్రమాదాల్లో తయారీదారులు మృతి చెందడంతో ఇక్కడ తయారీ కనుమరుగైపోయింది. టీడీపీ నిర్వహించే మహానాడు సభల సందర్భంగా ప్రారంభ వేడుకల్లో మండపేట నుంచి వెళ్లే మందుగుండు కాల్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచేవి. మాజీ ఎమ్మెల్యేలు దివంగత వీవీఎస్ఎస్ చౌదరి, వల్లూరి నారాయణరావులు ఈ కార్యక్రమాన్ని వారి ఆధ్వర్యంలో జరిగేలా చూసుకునేవారు. పట్టణంలో మొత్తం ఆరు కుటుంబాలు మందుగుండు తయారుచేసేవారు. ఇందులో అన్నవరపు కోటేశ్వరరావుకు చెందిన నాలుగు కుటుంబాలు అగ్ని ప్రమాదాల్లో మరణించగా, మిగిలిన రెండు కుటుంబాలూ మందుగుండు తయారీ మానేశారు. అలాగే కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం వాకతిప్పలో పదేళ్ల కిందట జరిగిన అగ్నిప్రమాదంలో 18 మంది మృతి చెందడంతో అక్కడ తయారీ ఆగిపోయింది. పెదపూడి, అమలాపురంలలో కూడా ప్రమాదాలతో తయారీ నిలిచిపోయింది.

బాణసంచాకు కేరాఫ్ అడ్రస్ కొమరిపాలెం, బిక్కవోలు

(ఆంధ్రజ్యోతి-బిక్కవోలు)

దీపావళి బాణసంచాకు తూర్పుగోదావరి జిల్లా కొమరిపాలెం, బిక్కవోలు గ్రామాలు రాష్ట్రవ్యాప్తంగా పేరొందాయి. కొమరిపాలెం గ్రామంలో 1932లో వెలుగుబంట్ల వీరన్న బాణసంచా తయారీ ప్రారంభించగా, ఆయన కుమారులు సత్యనారాయణమూర్తి, రామకృష్ణలు వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేశారు. ప్రస్తుతం శ్రీగణపతి ఫైర్ వర్క్స్ పేరిట వెలుగుబంట్ల సత్యనారాయణ మూర్తి తన కుమారుడు చిట్టిబాబుతో కలసి బాణసంచా తయారీ పరిశ్రమను కొనసాగిస్తున్నారు. ఇక్కడ శివకాశీ మాదిరిగా డిస్కో చిచ్చుబుడ్లు, టపాసులు, మతాబులు, బేబీ కాండెల్స్, పెన్సిళ్లు, తాళ్లు, పేల్చు జువ్వలు, బ్యాటరీ బాక్సులు, ఔట్లు, సెర్చిలైట్లు, రాకెట్లు తయారు చేస్తారు. అలాగే పండుగలకు, వివిధ ఫంక్షన్లలో కాల్చే ఈతచెట్టు, మల్లెపందిరి, నాగసర్పం, చైనావీల్, రన్నింగ్ వీల్, కలర్‌డైమండ్ వీల్, స్వస్తిక్‌వీల్, పెద్ద సెర్చిలైట్లు, జపాన్‌రింగు, మద్రాసు ఔట్లు తయారు చేస్తారు. వీరు తయారుచేసిన బాణసంచాను అప్పట్లో 1952లో మద్రాసులో జరిగిన ఏఐసీసీ సమావేశంలోను, 1978లో బెంగళూరులో జరిగిన జాతీయక్రీడల్లోను, 1983లో ఎన్టీఆర్ ప్రమాణస్వీకారానికి, 1983, 1999లలో హైదరాబాద్‌లో జరిగిన ఫిలిం ఫెస్టివల్స్‌కు, పలు చలన చిత్రాల శతదినోత్సవ వేడుకలకు కాల్చి కొమరిపాలెం ఖ్యాతిని చాటారు. 1999లో శిల్పారామంలో నిర్వహించిన బాణసంచా పోటీల్లో కొమరిపాలెం బాణసంచాకు ప్రథమస్థానం పొందడంతో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా సత్యనారాయణమూర్తి సత్కారం పొందారు. అలాగే కొమరిపాలెంతోపాటు బిక్కవోలులోని శ్రీగోలింగేశ్వరా ఫైర్ వర్క్స్‌ను ఆకాలంలోనే కొప్పిశెట్టి సూర్యనారాయణ ప్రారంభించగా ఆపై ఆయన కుమారుడు సత్యనారాయణ కొనసాగించగా, ఆయన మనుమడు శ్రీనివాస్ నిర్వహిస్తూ బిక్కవోలు బాణసంచా ఖ్యాతిని నిలిపారు. ఇంకా బిక్కవోలులో కనకదుర్గా హుస్సేనియా ఫైర్‌వర్క్స్ పేరిట బాణసంచా తయారు చేస్తున్నారు. కొమరిపాలెంలో వెలుగు బంట్ల వారి వద్ద శిక్షణ పొందిన వేల్పూరి సత్తిబాబు, నూకారెడ్డిలు 30 ఏళ్ల నుంచి భవానీ గ్రాండ్ ఫైర్స్ పేరిట బాణసంచా తయారు చేస్తున్నారు.


బిక్కవోలులో తయారు చేస్తున్న పేల్చు జువ్వలు

ప్రభుత్వం సబ్సిడీ రుణాలివ్వాలి

తాము ప్రమాదమని తెల్సినా అందరికీ ఆనందం కల్గించేందుకు ఏళ్ల తరబడి బాణసంచా తయారుచేస్తూ ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నాం. మా వద్ద నేర్చుకున్న 80 మంది ఆరు జిల్లాల్లో సొంతంగా బాణసంచా తయారీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మా వద్ద 20 కుటుంబాల వారు పనిచేస్తున్నారు. వీరికి ఏటా ఇన్సూరెన్స్ కూడా చెల్లిస్తున్నాం. అగ్ని ప్రమాదాల నివారణ చర్యలన్నీ చేపట్టాం. గంధకం, సూరేకారం, బీడు, అల్యూమినియం పౌడర్‌ను రూర్కెలా, హైదరాబాద్ నుంచి దిగుమతి చేసుకుని వాడతాం. తమిళనాడు రాష్ట్రంలో బాణసంచా తయారీని కుటీర పరిశ్రమగా గుర్తించి సబ్సిడీతో కూడిన రుణాలు అందజేస్తున్నారు. ఇక్కడ కూడా పరిశ్రమగా గుర్తించి సబ్సిడీతో కూడిన రుణాలు అందించాలి.



- వెలుగుబంట్ల సత్యనారాయణమూర్తి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఫైర్ వర్కర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు


యానాంలో వ్యాపారి నాగేశ్వరరావు

శివకాశి టు యానాం. ఏటా రూ. 8 కోట్ల వ్యాపారం

(ఆంధ్రజ్యోతి-యానాం)

కేంద్రపాలిత ప్రాంతం యానాంలో తయారీ పరిశ్రమ లేదుకానీ ఏటా ఉభయగోదావరి జిల్లాల స్థాయిలో ఏటా రూ.8 కోట్ల నుంచి పది కోట్ల వరకు బాణసంచా అమ్మకాలు సాగుతాయి. ఇక్కడి వ్యాపారులు నేరుగా శివకాశి నుంచి మందుగుండు సామగ్రిని ప్రత్యేక వాహనాల్లో తీసుకువస్తారు. యానాంలో అనునిత్యం దొరికే 7 హోల్‌సేల్ షాపుల్లో విక్రయాలు సాగిస్తారు. వీటితోపాటు దీపావళికి వారం ముందే మరో 21 షాపులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో వ్యాపారం జోరుగా సాగుతోంది. నేరుగా తీసుకురావడం వల్ల తక్కువకే వెరైటీలన్నీ లభిస్తాయి. ప్రస్తుతం పిల్లలతోపాటు పెద్దలను ఆకట్టుకునేందుకు రిటైల్ వ్యాపారస్తులు ఫ్యాన్సీ ఐటమ్స్‌పై మోజు చూపిస్తున్నారని, ఆ వెరైటీలు ఈసారి ఎక్కువగా వెళుతున్నాయని బాణసంచా వ్యాపారి నాగేశ్వరరావు చెప్పారు.

రెండో శివకాశీ.. వేట్లపాలెం

(ఆంధ్రజ్యోతి-సామర్లకోట)

దీపావళి బాణసంచా తయారీలో రెండో శివకాశీగా పేరొందిన గ్రామం వేట్లపాలెం. ఇది సామర్లకోట మండలంలో ఉంది. ఇదే మండలంలోని హుస్సేనుపురం, జి మేడపాడు గ్రామాల్లో కూడా పెద్దఎత్తున బాణసంచా తయారయ్యేది. ఏటా రూ.5 కోట్ల మేర వ్యాపార లావాదేవీలు జరుగుతూ 500 మంది కూలీలకు ప్రత్యక్షంగానూ, మరో వెయ్యి మందికి పరోక్షంగానూ బాణసంచా తయారీ ద్వారా ఉపాధి లభించేది. అయితే 2019 సెప్టెంబరు 30న జి. మేడపాడు కెనాల్ రోడ్డులోని ఒక బాణసంచా తయారీ సంస్థలో జరిగిన పేలుళ్లలో ఆరుగురు మృతి చెందారు. దాంతో ఆ గ్రామంలో బాణసంచా తయారీ మూతపడింది. కొవిడ్ తర్వాత, వైసీపీ ప్రభుత్వంలో తీవ్ర ఆంక్షల వల్ల సామర్లకోట మండలంలో ఈ వ్యాపారం కాస్త తగ్గిందనే చెప్పాలి. కానీ ఈ ఏడాది మళ్లీ భారీగా బాణసంచా తయారీ జరుగుతోంది. వేట్లపాలెం, హుస్సేన్‌పురం గ్రామాల్లో సుమారు ఏడు దశాబ్దాలుగా బాణసంచా తయారీచేస్తూ విక్రయాలు చేయడమేగాకుండా అంతకుమించి శివకాశి బాణసంచా సరుకులను కూడా ఈ ప్రాంత వ్యాపారులు దిగుమతులు చేసుకుంటూ ఏటా కోట్లలోనే లావాదేవీలు సాగిస్తుంటారు. వేట్లపాలెం, హుస్సేన్‌పురంలలో తయారయ్యే బాణసంచాలో చిచ్చుబుడ్లు, సెర్చిలైట్లు పేరొందాయి. మిగిలిన రకాల్లో మిడతల దండు, రాకెట్లు, చిటపటలు ప్రసిద్ధి. ఇక పలు పెళ్లిళ్లకూ, ఇతర వేడుకలకు ఇక్కడ తయారుచేసే బాణసంచాలో పందిరిమంచం, ఈతచెట్టు, రన్నింగ్‌బాల్, పాము బుసలు తదితర కలర్స్ రాకెట్లకు గిరాకీ ఎక్కువ.


వేట్లపాలెంలో టపాసుల తయారీ దృశ్యం

తరతరాలుగా బాణసంచా తయారీలో ద్రాక్షారామ, జువ్విపాడు

(ఆంధ్రజ్యోతి-ద్రాక్షారామ)

ద్రాక్షారామ కేంద్రంగా పెద్దిరెడ్డి వంశీకులు మూడు తరాలుగా బాణసంచా తయారీలో కొనసాగుతున్నారు. 1940లో మద్రాస్ లైసెన్సుతో పెద్దిరెడ్డి సుబ్బారావు మందుగుండు తయారీ ప్రారంభించారు. తదుపరి ఆయన కుమారులు పెద్దిరెడ్డి వీర్రాజు కాకినాడలో, పెద్దిరెడ్డి రాంబాబు, సూరిబాబులు ద్రాక్షారామలో బాణసంచా తయారీ చేపట్టారు. ద్రాక్షారామలో పెద్దిరెడ్డి సూరిబాబు ఆంజనేయ ఫైర్‌వర్క్సు స్థాపించి బాణసంచా తయారీలో పేరుప్రఖ్యాతులు సొంతం చేసుకున్నారు. ద్రాక్షారామలో కార్తీక దీపారాధన మహోత్సవంలో పెద్దిరెడ్డి సూరిబాబు బాణసంచా కాల్పులు చూసేందుకే వేలాదిమంది జనం ఎగబడేవారు. ప్రస్తుతం మూడో తరం వారసులు బాణసంచా తయారీని కొనసాగిస్తున్నారు. పెద్దిరెడ్డి వీర్రాజు అనంతరం వారసులు పెద్దిరెడ్డి సత్తిబాబు తూరంగి, పెద్దిరెడ్డి సూరిబాబు మృతి చెందడంతో ఆయన అల్లుడు దవులూరి వెంకట్రాజు అలియాస్ శ్రీను, పెద్దిరెడ్డి రాంబాబు కుమారుడు పెద్దిరెడ్డి సుబ్బారావు తాళ్లపొలంలో బాణసంచా తయారీ చేస్తున్నారు. తారాజువ్వలు, రాకెట్లు, విజిల్‌రాకెట్లు, బెలూన్ రాకెట్లు, ఆకాశదీపాలు, విజిల్ షాట్స్, బేబీ క్యాండిల్స్, మిడతల దండు, చిచ్చుబుడ్లు, డిస్కోబుడ్లు, బ్యాటరీ బ్యాక్సు దండ్లు, గొట్టం ఔట్లు, కలర్‌పెన్సిల్లు, సెర్చిలైట్లు, ఈతచెట్లు, మల్లి పందిరి, నాగస్వర్పం, చైనారింగు, జపాన్ రింగు, రన్నింగ్ బాల్, డైమండ్ వీల్ వంటివి ఇక్కడ తయారీకి ప్రసిద్ధి. హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాలకు ఎగుమతులు చేస్తున్నారు.


జువ్వలు తయారు చేస్తున్న పెద్దిరెడ్డి సుబ్బారావు

జువ్విపాడు.. పేరు

రామచంద్రపురం మండలంలోని ఓదూరు పంచాయతీ శివారు జువ్విపాడు అనే గ్రామం ఉంది. జిల్లేళ్ల ఆనందరావు ఈ గ్రామంలో బాణసంచా తయారీ ప్రారంభించారు. తదుపరి కొన్నేళ్లకు వెంకట్రావు త్రిమూర్తులు ఫైర్‌వర్క్సు పేరుతో బాణసంచా తయారీ కేంద్రం ప్రారంభించారు. త్రిమూర్తులు ఫైర్‌వర్క్సు స్థాపనతో జువ్విపాడు బాణసంచా తయారీకి పేరెన్నికగా మారింది. దీపావళితో పాటు ముఖ్యంగా తిరునాళ్లు, జాతరలు, పండుగలకు త్రిమూర్తులు ఫైర్‌వర్క్సు బాణసంచా మారుపేరుగా నిలిచింది. త్రిమూర్తులు ఫైర్‌వర్క్సు బాధ్యతలు వినకోటి శ్రీనివాస్ చేపట్టిన అనంతరం ఉభయగోదావరి జిల్లాల్లో జాతరలు, తిరునాళ్లలో త్రిమూర్తులు ఫైర్‌వర్క్సు పాల్గొని పలు బహుమతులు సొంతం చేసుకుంది. ఇలా బాణసంచా తయారీ దారులు జువ్విపాడు ఊరిపేరు సార్థకం చేశారు.


ఆంజనేయ ఫైర్‌వర్క్సు యజమాని దవులూరి


స్వామివారికి చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం, ధ్వజావరోహణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఘనంగా చక్రస్నానం

- ముగిసిన బ్రహ్మాండ నాయకుని బ్రహ్మోత్సవం
- మహాపూర్ణాహుతి, చక్రస్నానం, ధ్వజావరోహణం, స్వామివారి ఏకాంత సేవ
- ముగింపు ఉత్సవంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దంపతులు

ఆత్రేయపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. తొమ్మిదవ రోజు మంగళవారం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, మహాశాంతి హోమం, మహా పూర్ణాహుతి, ధ్వజావహరోణంతో బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవం ఘనంగా ముగిసింది. ఉదయం స్వామివారికి ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలతో అలంకరించి స్వర్ణశోభితుడిని చేశారు. వసంత మండపంలో ఉత్సవమూర్తులు కొలువుతీరి బ్రహ్మోత్సవ పూజలు అందుకున్నారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు-కమలారాణి దంపతులు, ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు- కనకదుర్గ దంపతులు నిర్వహించారు. సంకల్పం, విశ్వక్సేన పూజ, పుణ్యహవచనము, మహాశాంతి హోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలలో పాల్గొన్నారు. వైఖానస ఆగమశాస్త్రం ప్రకారం బ్రహ్మశ్రీ ఖండవల్లి రాజేశ్వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మేళతాళ మంగళవాయిద్యాల నడుమ స్వామివారిని పల్లకిలో అశేష భక్తజన గోవిందనామస్మరణ నడుమ గౌతమి గోదావరి వద్దకు తీసుకుని వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి చక్రస్నాన మహోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం మహాఆశీర్వచనము నిర్వహించారు. ధ్వజావరోహణంతో ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. రాత్రి స్వామివారి అద్దాల మండపంలో వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన ఉయ్యాలలో ఏకాంత సేవ జరిపారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు దంపతులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. బ్రహ్మోత్సవాలలో ముదునూరి వెంకట్రాజు-సత్యశ్రావణి దంపతులు, కాయల జగన్నాధం- మంగాదేవి దంపతులు పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన వాయిద్య కళాకారులు ప్రదర్శనలు విద్యుత్, పుష్పాల అలంకరణ భక్తులను ఆకట్టుకున్నాయి. తొమ్మిది రోజులపాటు జరిగిన బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తన్మయత్వం పొందారు.


స్వామివారిని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న భక్తులు


పూల ఊయలలో స్వామివారికి ఏకాంత సేవ దృశ్యం


మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారు దంపతులు

నేడు యథావిధిగా ఆర్జిత సేవలు

బ్రహ్మోత్సవాలు ముగియడంతో స్వామివారి ఆర్జిత సేవలు బుధవారం నుంచి యథావిధిగా నిర్వహిస్తున్నట్లు ఉపకమీషనరు చక్రధరరావు తెలిపారు. నోము ఆచరించిన భక్తులు ఆన్‌లైన్ స్లాట్ విధానంలో టిక్కెట్లు బుక్‌చేసుకుని అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు తదితర ఆర్జిత సేవలు నిర్వహించుకోవాలని ఈవో కోరారు.

పుష్కరాలకు సన్నద్ధమవుదాం

- 2027 గోదావరి పుష్కరాలపై సమీక్ష
- గత అనుభవాలే పాఠాలుగా..
- జిల్లాను యూనిట్‌గా తీసుకుని ప్రణాళిక
- రహదారుల విస్తరణ, ఘాట్ల అభివృద్ధి
- సీతానగరంవైపు వీఐపీ ఘాట్ల నిర్మాణం
- తొలి సమన్వయ సమావేశంలో రాష్ట్ర మంత్రి దుర్గేష్, ఎంపీ పురందేశ్వరి



తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరంలో పుష్కరాలపై జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్, చిత్రంలో ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యేలు గోరంట్ల, బత్తుల, ముప్పిడి, కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహకిషోర్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 28: గత అనుభవాలనే పాఠాలుగా చేసుకుని ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా 2027 అఖండ గోదావరి పుష్కరాలను నిర్వహిద్దామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం 2027 అఖండ గోదావరి పుష్కరాల సమన్వయ తొలి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ అఖండ గోదావరి పుష్కరాలు 2027 జూలై 23 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకూ జరుగుతాయన్నారు. అఖండ గోదావరి పుష్కరాలకు జిల్లాను యూనిట్‌గా పరిగణనలోకి తీసుకుని సమర్థవంతంగా నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకువెళదామన్నారు. సుమారు 8 కోట్ల మంది భక్తులు అఖండ గోదావరి పుష్కరాలకు వస్తారనే అంచనా వేస్తున్నట్టు తెలిపారు. అఖండ గోదావరిలో ఎక్కడ స్నానం చేసినా పుణ్యం వస్తుందనే విషయం భక్తులకు తెలియజేయాలన్నారు. ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ అఖండగోదావరి పుష్కరాలకు సంబంధించి ప్రభుత్వశాఖల మధ్య సమన్వయం ఉండాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, తాగునీరు తదితర మౌలిక వసతులు, నూతనంగా మరికొన్ని ఘాట్లకు ప్రతిపాదనలు, టెంపుల్ టూరిజంపై దృష్టిపెట్టాలన్నారు. కలెక్టర్ పి. ప్రశాంతి మాట్లాడుతూ పుష్కరాలకు సంబంధించి వీఐపీ ఘాట్లను సీతానగరంవైపు నిర్మించాలన్నారు. గోదావరి వ్యూ అద్భుతంగా ఉండే ప్రాంతాలను అభివృద్ధి చేయాలన్నారు.కడియం నర్సరీ ప్రాంతాల్లో అతిథిగృహాలు, మౌలిక సదుపాయాలు, సమగ్రప్రాతిపదికన అభివృద్ధికి ప్రతిపాదన చేయాలన్నారు. రహదారుల విస్తరణ పనులు జరగాలని తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నగరంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేప ట్టాలన్నారు. కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గంలో మొత్తం 26స్నానాలరేవులు ఉన్నాయన్నారు. విజ్జేశ్వరం నుంచి పట్టిసీమ వరకు 13 ఘాట్లు ఉన్నట్టు తెలిపారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ గోదావరి పుష్కరాల పేరు చెబితే సీతానగరం మండలంలో గుర్తుకు వచ్చేది మునికూడలి ఘాట్ అన్నారు. దానికి గతంలో చంద్రబాబు దేవాన్ష్ ఘాట్‌గా నా మకరణ చేశారని తెలిపారు. ఈ రేవును ఆధునీకరించాలన్నారు. సీతానగరంలో 8 రేవులు ఉన్నట్టు తెలిపారు. ఎస్పీ డి.నరసింహకిశోర్ మా ట్లాడుతూ అఖండ గోదావరి పుష్కరాలకు వచ్చే కోట్లాది మంది భక్తుల రద్దీకి తగ్గట్టుగా విడివిడిగా మార్గాలు ప్రతిపాదిస్తున్నామన్నారు. భక్తుల వసతి కోసం శాటిలైట్ సిటీ, బస్టాండ్ పార్కింగ్ స్థలం గుర్తించాం, సీసీ కెమెరాలు, ప్రవేశ నిర్గమ ద్వారాలు, లోకల్ ట్రాన్స్‌పోర్టు తదితర అంశాలపై ఆయా శాఖలతో చర్చలు జరుపుతాం.కమిషనర్ కేతన్‌గార్గ్ తొలుత పుష్కరాలపై ఏవి ప్రదర్శన చేశారు. అనంతరం శాఖల వారీగా అధికారులతో కలెక్టర్ ప్రశాంతి సమీక్షించారు. కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత తన డివిజన్ పరిధిలోని కొవ్వూరు నుంచి నిడదవోలు వరకు గోదావరి రేవుల పరిస్థితిని వివరించారు. గతంలో పార్కిం గ్‌కు భూములు ఇచ్చిన రైతులకు బకాయిలు చెల్లించకపోవడంతో ఇప్పుడు రైతులు ముందుకు రావడంలేదన్నారు. అయినా వారితో సంప్రదింపులు జరుపుతున్నామన్నారు. లక్ష్మీనగర్ లేఅవుట్‌లో ఉన్న స్థలాన్ని పార్కింగ్‌కు వినియోగించవచ్చని చెప్పారు. రాజమహేంద్రవరం ఆర్‌డీవో కృష్ణనాయక్ మాట్లాడుతూ సీతానగరం నుంచి కడియం వరకు ఉన్న రేవుల పరిస్థితిని వివరించారు. నూతనరేవుల నిర్మాణాలకు అనుగుణంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టాలన్నా రు. టూరిజం ఆర్‌డీ స్వామినాయుడు మాట్లాడుతూ టూరిజం పరంగా ప్రణాళికతో ముందుకు వస్తామన్నారు. రెండో సమావేశం నాటికి తాము మరిన్ని ప్రణాళికలతో వస్తామన్నారు. సమావేశంలో డీఎస్పీలు దేవకుమార్, భవ్యకిషోర్, ఆర్ ఎంసీ అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా శాంతి కల్యాణం


స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అంతర్వేది, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం బహుళద్వాదశిని పురస్కరించుకుని స్వామి-అమ్మవార్లకు శాంతి కల్యాణం నిర్వహించారు. తొలుత ఆలయ పురాతన కల్యాణ మండపం వద్ద స్వామి-అమ్మవార్లను ప్రత్యేక సింహాసనంపై ఆశీనులు చేసి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం అర్చకులు కల్యాణ తంతు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు శాంతి కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి, అర్చకులు పాల్గొన్నారు.


డాక్టర్ శ్యామ్‌కుమార్‌కు ఎంపిక పత్రం ఇస్తున్న వీసీ మురళీకృష్ణ

అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలకు పరిశీలకునిగా శ్యామ్‌కుమార్

జేఎన్టీయూకే, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ ఆధ్వర్యంలో చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో బుధవారం నుంచి నవంబరు 3వ తేదీ వరకు జరిగే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయాల పురుషుల కబడ్డీ పోటీలకు పరిశీలకునిగా జేఎన్టీయూకే స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి డాక్టర్ జి.శ్యామ్‌కుమార్‌ను నియమిస్తూ ఏఐయూ ఉత్తర్వులు జారీ చేసింది. శ్యామ్‌కుమార్‌ను ఇన్‌చార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, రెక్టార్ కేవీ రమణ, రిజిస్ట్రార్ రవీంద్రనాథ్ ప్రత్యేకంగా అభినందించారు. కబడ్డీ పోటీలను విజయవంతంగా నిర్వహించి యూనివర్శిటీకి మంచి పేరు తీసుకురావాలని వీసీ ఆకాంక్షించారు.


తుని డిపోలో డ్రైవర్ లోవరాజు

రైట్ రైట్... మళ్లీ విధుల్లోకి లోవరాజు

తుని రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్ లోవరాజు మంగళవారం ఉదయం విధుల్లో చేరాడు. నాలుగు రోజుల కిందట బస్సు ముందు డ్యాన్స్ చేయడంతో ఆయన్ను విధుల నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియా ద్వారా ఈ విషయం తెలుసుకున్న మంత్రి నారా లోకేశ్ చొరవ చూపడంతో అధికారులు తిరిగి విధులు అప్పగించారు. దీంతో లోవరాజు మంగళవారం ఉదయం తుని-కాకినాడ బస్సు ఎక్కి ఉత్సాహంగా బాధ్యతలు స్వీకరించాడు.



అమ్మా... నాన్నా... మీరెక్కడ!

- ఏడిద బాణసంచా పేలుడు ఘటనలో తండ్రి దుర్మరణం
- తల్లి ఆసుపత్రిలో మృత్యువుతో పోరాటం
- బంధువుల సంరక్షణలో చిన్నారి మోక్షిత్

మండపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఈ పాలబుగ్గల చిన్నారి తల్లి పిలుపు కోసం, నాన్న లాలన కోసం అమాయకంగా ఎదురు చూస్తున్నాడు. వారు ఏమయ్యారో కూడా తెలియని పసి వయసు. ఎవరు ఎత్తుకుంటే వారి వద్దే ఉంటున్నాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఏడిదలో సోమవారం జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో కల్లి వెంకటకృష్ణ మృతి చెందిన సంగతి తెలిసిందే. అతడి భార్య జయశ్రీ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృత్యువుతో పోరాడుతోంది. వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు. వెంకటకృష్ణ-జయశ్రీ తమ కుమారుడు మోక్షిత్‌కు ఇటీవలే మొదటి పుట్టినరోజు జరిపారు. పేలుడు సమయంలో పక్కింటి వద్ద ఆడుకుంటుండటంతో ఆ చిన్నారి ప్రాణాలతో బయటపడ్డాడు. ముద్దులొలుకుతున్న ఆ పసివాడిని వెంకటకృష్ణ బంధువులు, చుట్టుపక్కల వారు లాలిస్తున్నారు. బోర్లు కొడుతూ జీవనం సాగించే వెంకటకృష్ణ మృతితో అతడి కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఇదే ప్రమాదంలో గాయపడ్డ వెంకటకృష్ణ తల్లిదండ్రులు కోలుకుంటున్నారు.



ఇన్వర్టర్ బ్యాటరీ పేలుడు కూడా కారణమే

తేల్చిన ఫోరెన్సిక్ నిపుణుల బృందం

ఏడిదలో బాణసంచా పేలుడు ఘటనపై పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. ఇందులో భాగంగా విజయవాడ నుంచి ముగ్గురు నిపుణులతో కూడిన ఫోరెన్సిక్ బృందం వచ్చింది. ఇంటిని పరిశీలించి ప్రమాద ఘటనకు కారణాలపై ఆరా తీశారు. బాణసంచా తయారీకి సల్ఫర్, పొటాష్, గంధకం, బొగ్గు వినియోగించినట్టు గుర్తించారు. పేలుడు తీవ్రత ఎంత మేర జరిగింది, భవనం కూలేంతగా మందుగుండు ఏ మేరకు వాడారో క్షుణ్ణంగా పరిశీలించారు. ఇంటిలో ఇన్వర్టర్ బ్యాటరీ లీకవ్వడం, అందులోని రసాయన పదార్థాలు పేలడం కూడా ప్రమాదానికి కారణంగా గుర్తించారు. ప్రమాదం జరిగినప్పటి నుంచీ రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ, మండపేట రూరల్ సీఐ పి.దొర్రాజు, మండపేట రూరల్ ఎస్ఐ సురేష్, మండపేట అగ్నిమాపక సిబ్బంది, రెవెన్యూ శాఖ సిబ్బంది అక్కడే ఉండి పరిస్థితిని సమీక్షిస్తున్నారు.



గో వధకు...

- కొత్తపల్లి అడ్డాగా పశువుల తరలింపు
- వారంలో మూడుసార్లు రవాణా
- ముగ్గురు వ్యక్తుల సిండికేట్
- తద్వారా లక్షలాది రూపాయల అర్జన



చింతూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కొంతమంది కఠినాత్ములు ఒక సిండికేట్‌గా ఏర్పడ్డారు. గో వధ కోసం పశువులను అమ్ముతూ లక్షలు అర్జించడం మొదలుపెట్టారు. వీరి దందా కారణంగా వందల సంఖ్యలో పశువులు కబేళాలకు తరలిపోతున్నాయి. వ్యాన్లు, కంటైనర్లలో కిక్కిరిసి తరలించడం వారు ఎంచుకున్న మార్గం. అందుకు అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం కొత్తపల్లిని అడ్డాగా ఎంచుకున్నారు. వీరికి పశువులను సరఫరా చేసేందుకు సరిహద్దు రాష్ట్రమైన ఒడిశాలో మరో ముఠా ఉంది. ఒడిశాలో ఊరూరా తిరిగి పశువులను కొనుగోలు చేయడం ఆ ముఠా వంతు. తర్వాత వాటిని సీలేరు నదిపై నాటు పడవల్లో దాటించి కొత్తపల్లి చేరుస్తున్నారు. ఇక్కడి నుంచి తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు కంటైనర్లు, వ్యాన్లలో తరలిస్తున్నారు. ఇలా తరలించేందుకు చింతూరు (ఎర్రంపేట)కు చెందిన ఓ వ్యక్తితో పాటు గోకవరం, జంగారెడ్డిగూడెం, ఏలూరు, ఒడిశాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు సిండికేట్‌గా ఏర్పడ్డారు. వీరంతా గోవధతో కొద్ది కాలంగా లక్షలు అర్జిస్తున్నారు. ప్రతి శుక్ర, శని, ఆదివారాల్లో రాత్రివేళ ఈ తరలింపు ప్రక్రియ యథేచ్ఛగా సాగుతోంది. దందా ఎవరి కంటా పడకుండా ఆ ముఠా జాగ్రత్త పడుతుంది. ఇందులో భాగంగా తులసిపాకల, ఎర్రగొండపాకల పరిసర అటవీ ప్రాంతంలో వందల సంఖ్యలో పశువులను కట్టేస్తున్నారు. అనంతరం రహస్య ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకున్న ర్యాంపుల వద్దకు వాహనాలు చేరుకుంటాయి. అప్పటివరకు రోజుల తరబడి పశువులు నీరు, మేత లేకుండా అల్లాడిపోతుంటాయి. దీంతో కొన్ని పశువులు అక్కడే మృత్యువాతపడుతున్నాయి. అంతేకాదు వ్యాన్లలో ఎక్కించే సమయంలో మొరాయించిన పశువుల కాళ్లు విరగ్గొట్టి పడేస్తారు. ఇదంతా నిత్యం సాగుతున్న బహిరంగ దందా. పశువులు దాచి ఉంచిన రహస్య ప్రదేశాల వద్దకు ఇతరులెవ్వరు వెళ్లినా వేగుల ద్వారా ఆ సమాచారం ఆ ముఠాకు ఇట్టే చేరుతుంది. పశువులను ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలించాలంటే విధిగా నియమ నిబంధనలు పాటించాల్సి ఉంది.

ఈ విషయంలో ఆ ముఠా తమ తెలివి తేటలను ప్రదర్శిస్తుంది. పోలీసు చెక్‌పోస్టులు దాటే వరకు పశువులను కాలినడకన తరలించడం అందులో ఒక భాగం. అనంతరం జనసంచారం లేని ప్రదేశాల్లో వ్యాన్లు, కంటైనర్లలో ఎక్కించి తరలించి సొమ్ములు చేసుకోవడం వీరికి వెన్నుతో పెట్టిన విద్య. మరికొన్ని పశువులను కూనవరం వద్ద గోదావరిలో పడవలపై దాటించి రుద్రంకోట చేరుస్తున్నారు. ఇదంతా అర్ధరాత్రి సమయంలోనే. దాదాపు 50 మంది దాకా ఈ పనులన్నీ చక్కపెడతారు.



ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఎర్రగొండపాకల-తులసిపాకల మధ్య, కూనవరం వద్ద గోదావరి ఒడ్డున గోవులను సిద్ధం చేసిన దృశ్యం



బాలురు సింగిల్స్‌లో సత్తా చాటిన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీల్లో విజేతలు వీరే

కాకినాడ అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): 68వ రాష్ట్రస్థాయి టెన్నిస్ పోటీలు కాకినాడ డీఎస్ఏ మైదానంలో రెండో రోజైన మంగళవారం కొనసాగాయి. వివిధ జిల్లాల క్రీడాకారులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన వారిని జాతీయ స్థాయికి ఎంపిక చేస్తామని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. మంగళవారం పోటీలను రాష్ట్ర పరిశీలకుడు ఎస్.వెంకటసుబ్బయ్య, ఎస్కే బాబు, టెన్నిస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామ్‌కుమార్ పరిశీలించారు. వి.రవిరాజు, కె.నూకరాజు, కౌర్, జి.సునీల్‌కుమార్, కె.పరశురాం పాల్గొన్నారు.

బాలుర సింగిల్స్...

అండర్-19 విభాగంలో ఎన్.హేమంత్‌సాయి (శ్రీకాకుళం), సీహెచ్ నవీన్ (చిత్తూరు), బి.కరుణ (చిత్తూరు), ఆర్.విశాల్ (రాజమహేంద్రవరం), ఎస్.దివ్యేశ్ (విశాఖ). షాయిబ్ అబూ బాఖిబ్ సిద్ధిక్ (చిత్తూరు), ఎం.రేవంత్(కృష్ణా), ఎం.సూర్యతేజస్విని (కృష్ణా), ఎస్కే అబ్బర్ అహమ్మద్ (గుంటూరు), వై.తేజిత్ (గుంటూరు), ఎస్.చరణ్‌కుమార్ (గుంటూరు), కె.అభిషేక్‌కుమార్ (తూర్పు గోదావరి), పి.రోహిత్‌చంద్ (గుంటూరు), పి.వీవన్‌గౌతమ్ (గుంటూరు), రిషి కరుణ (తూర్పు గోదవరి)

అండర్-14 విభాగంలో

ఎస్కే మహ్మమద్ హర్షద్ (చిత్తూరు), కె.శ్రీకృష్ణ (శ్రీకాకుళం), ఎస్ఏఆర్ ప్రభాస్‌రెడ్డి (కర్నూలు), వై.మహంత్‌నీలేష్‌రెడ్డి (కర్నూలు), టి.వెంకటసాయిఅరుష్ (గుంటూరు), యు. సాయిశౌర్య (కృష్ణా), జి.నిఖిలేష్ (తూర్పు గోదావరి), వై.హరీష్ (కృష్ణా), వై.నీరజ్‌రెడ్డి (గుంటూరు), కె.నిశాంత్ (కర్నూలు), బి.పవన్ సాయి (విజయనగరం), ఎస్.ఈశ్వర్‌హితేష్ (కృష్ణా), దుర్గాశ్రీఅఖిల్ (పశ్చిమ గోదావరి), ఎన్.ధీరజ్ (అనంతపురం), ఎన్.నాగచరణ్ (తూర్పు గోదావరి) పవన్‌కుమార్‌యశరాజ్ (చిత్తూరు), బి.దాత్రేష్ (విశాఖ), ఎస్‌టీఎస్‌టీ సుభాష్ (తూర్పుగోదావరి), వై.ఈశాన్ (తూర్పు గోదావరి), ఎ.వీరన్ (విశాఖ)

బాలికల సింగిల్స్ అండర్-14 విభాగంలో

పి.సేవిత (విశాఖ), ఎస్కే ఆనమ్ హబాబ్ (అనంతపురం), పీవీ శుక్తిశ్రీ (గుంటూరు), డి.ఆరీఫా (అనంతపురం), ఎస్.తనిష్కారెడ్డి (గుంటూరు), జి.శ్రీవేద (తూర్పు గోదావరి), పి.వేదశ్రీ (శ్రీకాకుళం).


అండర్-14,17 విభాగాల్లో విజేతలుగా నిలిచి ట్రోఫీలు అందుకున్న క్రీడాకారులు

బ్యాడ్మింటన్ టోర్నమెంట్ విజేతలు

మలికిపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ 68వ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 బాలబాలికల బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో విజేతలకు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మంగళవారం బహుమతులు అందజేశారు. బాలురు అండర్-17 విభాగంలో తూర్పు గోదావరి జిల్లా (ప్రథమ), విశాఖపట్నం జిల్లా (ద్వితీయ), అండర్-14 విభాగంలో పశ్చిమ గోదావరి జిల్లా (ప్రథమ), విశాఖపట్నం (ద్వితీయ) స్థానాల్లో నిలిచాయి. బాలికలు అండర్-17 విభాగంలో కృష్ణా జిల్లా (ప్రథమ), అనంతపురం జిల్లా (ద్వితీయ), అండర్-14 విభాగంలో కృష్ణా జిల్లా (ప్రథమ), నెల్లూరు జిల్లా (ద్వితీయ) స్థానాల్లో నిలిచాయి. వ్యక్తిగత విభాగంలో పోటీలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో శ్రీరామ అకాడమీ ఫౌండర్ దెందుకూరి రాంబాబురాజు, కార్యదర్శి అడబాల విజయశ్రీనివాస్, ఎం.సత్యరాజు, పెద్దిరాజు పాల్గొన్నారు.

పుష్కర కాలువలో పడి యువకుడి మృతి



గండేపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారికి చెందిన ఐనపాల ధర్మరాజు (30) గ్రామ శివారున పెద్ద చెరువు దగ్గరలోని పొలానికి వెళ్లేందుకు సోమవారం రాత్రి పుష్కర కాలువ అక్విడెక్టు సైడ్‌వాల్ మీదుగా నడుచుకుంటూ వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కాలువలో పడిపోయాడు. విషయం తెలియగానే స్థానికులు వెతకగా మంగళవారం ఉదయం కాలువలో విగతజీవిగా దొరికాడు. గండేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ శివనాగబాబు కేసు నమోదు చేశారు.

త్రోబాల్, బాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు

అనపర్తి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విద్య, క్రీడల పట్ల సమాన ఆసక్తి కనబరచాలని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కోరారు. తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి తూర్పు గోదావరి స్థాయి అండర్-14, 17 బాలికల త్రోబాల్, బాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలను మంగళవారం ఆయన ప్రారంభించారు. హెచ్ఎం పులగం వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీల నిర్వహణ ద్వారా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు జాతీయ స్థాయికి ఎదిగే అవకాశాలున్నాయన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్‌పర్సన్ మల్లిడి పార్వతి, నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, కర్రి శేషారత్నం, పోతంశెట్టి సుభాషిణి, సర్పంచ్‌లు గొల్లు హేమతులసి, గిరిడా గంగాభవాని పాల్గొన్నారు.

తల్లీకూతుళ్ల ఆత్మహత్య

- ఇంట్లోంచి దుర్వాసన రావడంతో బయటపడ్డ వైనం
- మూడు రోజులై ఉండొచ్చన్న పోలీసులు

కాకినాడ క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత కారణాలతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓ తల్లి, కూతురు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన ఆకాశం స్వాతి (28), ఆమె తల్లి ఆకాశం సరస్వతి (60) 12 ఏళ్లుగా కాకినాడ వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెంకే వారి వీధిలో గుర్రాల శ్రీనివాస్‌కుచెందిన శ్రీదుర్గా నివాస్‌లో అద్దెకు ఉంటున్నారు. సరస్వతి పెద్ద కుమార్తె హారికకు వివాహమై విశాఖపట్నంలో ఉంటోంది. రెండో కుమార్తె స్వాతి ఇంటి వద్ద టైలరింగ్ చేస్తూ తల్లిని పోషిస్తోంది. కొంత కాలంగా సరస్వతి మానసిక పరిస్థితి బాగా లేని కారణంగా తల్లి, కూతురు మధ్య మనస్పర్థలు వచ్చాయి. ఒకరిని విడిచి మరొకరు ఉండలేని ఆ తల్లీకూతుళ్లు తీవ్ర మనస్తాపానికి గురై చనిపోదామని నిర్ణయించుకుని చీరలతో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషయం ఎవరికీ తెలియలేదు. మంగళవారం ఇంట్లోంచి దుర్వాసన వస్తుండడం గమనించిన గుర్రాల శ్రీనివాస్ కిటికీలను తెరిచి చూడగా తల్లి, కూతురు విగతజీవులుగా కనిపించారు. శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ ఎం.నాగదుర్గారావు సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. స్వాతిని పెళ్లి చేసుకోమని తల్లి సరస్వతి తరచూ ఒత్తిడి తెస్తోందని... తల్లిని విడిచి ఉండలేక, పెళ్లంటే ఇష్టం లేక వారు ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని స్థానికులు చెప్తున్నారు. ఇది జరిగి సుమారు మూడు రోజులై ఉంటుందని సీఐ నాగదుర్గారావు వెల్లడించారు. వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఆత్మహత్యకు పాల్పడిన స్వాతి (పాత చిత్రం), మృతదేహాలను పరిశీలిస్తున్న సీఐ నాగదుర్గారావు

విపత్తుల నిర్వహణ మేనేజర్ బదిలీ

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా విపత్తుల నిర్వహణ శాఖ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం.లావణ్యను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆమెను శ్రీకాకుళం జిల్లా వంశధార ప్రాజెక్ట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు.

కాంట్రాక్ట్ ఏఈ విధుల నుంచి తాత్కాలికంగా తొలగింపు

అన్నవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో వాటర్ వర్క్స్ విభాగం కాంట్రాక్ట్ ఏఈగా పని చేస్తున్న ఎం.గురవయ్యను విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తూ ఈవో కె.రామచంద్రమోహన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం సహాయ కమిషనర్ సీహెచ్ రామ్మోహన్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) వి.రామకృష్ణపై గురవయ్య అనుచితంగా ప్రవర్తించి, దుర్భాషలాడి కొట్టడానికి ప్లాస్టిక్ కుర్చీ ఎత్తాడు. అక్కడున్న డీఈ (ఎలక్ట్రికల్) వి.సత్యనారాయణ కలుగజేసుకుని అడ్డుకుని గురవయ్యను బయటకు పంపాడు. సహాయ కమిషనర్ కార్యాలయ అటెండరు, ఇతర సిబ్బంది సమక్షంలో ఈ ఘటన జరిగిందంటూ ఈఈ రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్యలు తీసుకున్నారు. జరిగిన ఘటనపై విచారణకు ఆదేశిస్తూ ఏఈ గురవయ్య స్థానంలో తాత్కాలికంగా పి.విజయప్రసాద్‌బాబు (కాంట్రాక్ట్ ఏఈ)ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రత్తిపాడులో 4న లక్ష దీపాల మధ్య కోటి బిల్వార్చన



కోటి బిల్వార్చన జరగనున్న మైదానం (పైన) అయ్యప్ప పడి పూజకు వేదిక (కుడి)

ప్రత్తిపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడులో నవంబరు 4న లక్ష దీపాల మధ్య కోటి బిల్వార్చనను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అయ్యప్ప కోటి బిల్వార్చన కమిటీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. 25వేల మంది అయ్యప్ప భక్తులతో జరిపేందుకు మినర్వా కళాశాల ఎదుట ఎనిమిది ఎకరాల సువిశాల ప్రాంగణాన్ని తీర్చిదిద్దుతున్నారు. రూ.80లక్షల నుంచి కోటి రూపాయల వరకు వ్యయం అయ్యే కోటి బిల్వార్చన, లక్ష దీపోత్సవంలను తిలకించడానికి రావాల్సిందిగా అయ్యప్ప స్వాములు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులను ఆహ్వానిస్తున్నారు. శబరిమల ఆలయ అర్చకుడు మేల్‌శాంతి, పందళ రాజవంశీయుడు నారాయణ వర్మ రానున్నట్టు అయ్యప్ప కోటి బిల్వార్చన కమిటీ సభ్యుడు, గురుస్వామి చంటిస్వామి మంగళవారం విలేకరులకు తెలిపారు. లక్ష్మీగణపతి హోమం, చండీ హోమం,పూర్ణాహుతి, దండపాణి గురువర్యుల గురుపూజోత్సవం జరుపుతామని చంటిస్వామి చెప్పారు.


వివరాలు వెల్లడిస్తున్న చంటి స్వామి

రాష్ట్రస్థాయి చెస్ పోటీల్లో సత్తా


ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

కాకినాడ అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో అండర్-17 విభాగంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జట్టు క్రీడాకారులు ప్రతిభ చాటారు. అన్ని విభాగాల్లోనూ సత్తాచాటి ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. విజేతలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి లంకా జార్జి, డీఎస్ఏ సీఈవో బి.శ్రీనివాస కుమార్, డీఈవో పి.రమేష్ అభినందించారు.

పారిశుధ్య చర్యలు
అయినవిల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నేదునూరు గ్రామం పెదపేట కాలనీలో మంగళవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత కోసం బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ అన్వర్, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రింటర్, ఇన్వర్టర్ అందజేత
పి.గన్నవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం హైస్కూల్‌కు పూర్వ విద్యార్థులైన సోదరులు చినమిల్లి వెంకటరామకృష్ణ, కొండయ్యనాయుడులు మంగళవారం తల్లిదండ్రులు భుజంగరావు, అనంతలక్ష్మి జ్ఞాపకార్థం ప్రింటర్, ఇన్వర్టర్‌ను హెచ్ఎం డీఎస్‌వీ ప్రసాద్, లెక్కలు ఉపాధ్యాయుడు జి.అమ్మిరాజులకు అందించారు.

సేవల విస్తరణకు జూనియర్ రెడ్‌క్రాస్ సొసైటీలు

కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్


మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మానవసేవే మాధవసేవగా భావించి మానవత్వంతో సేవలు అందించడంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ముందు వరుసలో ఉందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. సేవలను మరింత విస్తృతం చేయడంతో పాటు విద్యార్థి దశ నుంచి సేవాభావం పెంపొందించేందుకు జిల్లా విద్యాశాఖాధికారి ఆధ్వర్యంలో జూనియర్ రెడ్‌క్రాస్ సొసైటీలను విద్యార్థులతో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యవర్గ సమావేశం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ప్రకృతి విపత్తులు, అత్యవసర పరిస్థితులు, సంక్షోభం సంభవించినప్పుడు రెడ్‌క్రాస్ సొసైటీ విస్తృతంగా సేవలు అందించాలని సూచించారు. కొత్తపేట మండలం పలివెలలో రక్తనిధి కేంద్రం ఏర్పాటుకుసహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రాథమిక చికిత్స వైద్య విధానాలను పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు నేర్పించాలన్నారు. రాష్ట్ర రెడ్‌క్రాస్ నుంచి మంజూరైన సంచార వైద్య వాహనాన్ని 104తరహాలోనే వైద్య సేవలందించేలా చూడాలన్నారు. సఖినేటిపల్లి లాకుల వద్ద గోదావరి హెడ్‌వర్క్స్‌లో నిరుపయోగంగా ఉన్న పాత భవనాలను రెడ్‌క్రాస్ సేవల కోసం వినియోగించుకునేందుకు సంప్రదింపులు జరుపుతామన్నారు. జిల్లాలో ఖాళీ అయిన రెడ్‌క్రాస్ కార్యదర్శి ఎంపిక కోసం ముగ్గురు పేర్లు ప్రతిపాదిస్తే వారిలో ఒకరిని ఎంపిక చేస్తామన్నారు. రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కోరుకొండ సత్యనారాయణ మాట్లాడుతూ రెడ్‌క్రాస్ జిల్లా యూనిట్ ముందంజలో నిలిపేందుకు సహకరించాలన్నారు. సొసైటీలో 432మంది సభ్యులుగా ఉన్నారన్నారు. మహా ప్రస్థానం వాహన నిర్వహణకు, సిబ్బంది నియామకానికి మార్గదర్శకాలు జారీ చేయాలని కలెక్టర్‌ను కోరారు. జిల్లా రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు, మండలీక ఆదినారాయణ, రంకిరెడ్డి కాశీవిశ్వనాథం, పట్నాల రమణ పాల్గొన్నారు.

గోగన్నమఠం-కరవాక వంతెన నిర్మాణానికి కృషి


గోగన్నమఠం-కరవాక వంతెన నిర్మాణానికి స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

మామిడికుదురు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): శంకరగుప్తం డ్రెయిన్‌పై గోగన్నమఠం-కరవాక మధ్య వారధి నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పేర్కొన్నారు. వంతెన నిర్మాణంపై మంగళవారం ఎమ్మెల్యే సమీక్ష చేసి స్థానికులతో చర్చించారు. రెండు గ్రామాల ప్రజల చిరకాల కోరిక మేరకు సంబంధిత అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి సాధ్యాసాధ్యాలపై పరిశీలన చేశారు. రెండు గ్రామాల ప్రజలతో మాట్లాడి వారి కష్ట నష్టాలను అడిగి తెలుసుకున్నారు. వంతెన నిర్మాణానికి ఉన్నతాధికారులతో మాట్లాడి కార్యాచరణ చేస్తానని ఆయా గ్రామాల ప్రజలకు తెలిపారు. గుండుబోగుల పెద్దకాపు, అల్లు సురేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ప్రజా అవసరాలను గుర్తిస్తాం
మలికిపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవసరమైన పనులకు ప్రాధాన్యమిస్తామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని గుడిమెళ్లంక భాష్యం పాఠశాల వద్ద వేపచెట్టు డ్రెయిన్‌పై ఉన్న వంతెనను, సత్యజ్యోతి థియేటర్ వద్దనున్న వంతెనను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముందుకు వెళతానన్నారు. జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. సత్యజ్యోతి వద్ద థియేటర్‌ను పరిశీలించారు. ఎక్కువ ప్రాముఖ్యం ఉన్న భాష్యం పాఠశాల వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయమని డ్రైనేజీ డీఈఈ ఆర్.నాగార్జునను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట పెద్దకాపు, మల్లిపూడి సత్తిబాబు, మేడిచర్ల రాము, జంపన సత్యనారాయణరాజు, గెడ్డం తులసీభాస్కర్, పిండి సత్యనారాయణ, జక్కంపూడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ పంటలతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు


ఉద్యాన పరిశోధనా కేంద్రానిన సందర్శించిన సిరిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు

అయినవిల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంభిస్తూ సేంద్రియ పద్ధతిలో పంట సాగు చేస్తే ఆరోగ్యకరమైన ఉత్పత్తులను పొందవచ్చునని అంబాజీపేట ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు పేర్కొన్నారు. సిరిపల్లి ఎస్‌జేఆర్ ఉన్నత పాఠశాల 9, 10 తరగతుల విద్యార్థులు అంబాజీపేట కొబ్బరి పరిశోధనా కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా అగ్రికల్చర్, ఒకేషనల్ ట్రైనీ ఎల్.కమలప్రియ విద్యార్థులకు కొబ్బరి, కోకో పంట పెంపకంపై అవగాహన కల్పించారు. సేంద్రియ ఎరువులు వాడే విధానం, మిత్ర పురుగుల పెంపకంపై వివరించారు. పాఠశాల హెచ్ఎం నిమ్మకాయల గణేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జి.సాయిశ్రీనివాస్, ఎ న్.పద్మావతి, జి.భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

జాతీయస్థాయి జుజిట్సు పోటీలకు ఎంపిక
అమలాపురం టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి జు జిట్సు పోటీలకు అమలాపురం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఇద్దరు ఎంపికైనట్టు కోచ్ పడాల అంజి తెలిపారు. నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన రాష్ట్రస్థాయి జు జిట్సు చాంపియన్ షిప్ పోటీల్లో అండర్-14లో నందుల వెంకటషణ్ముక్ 60 కిలోల ఫైటింగ్ విభాగంలో, అండర్-16 విభాగంలో బొలిశెట్టి సౌమ్యరాణి 56 కిలోల ఫైటింగ్‌లో స్వర్ణ పతకాలు సాధించి, త్వరలో ఉత్తరాఖండ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారిని చైర్మన్ నంద్యాల మనువిహార్, ప్రిన్సిపాల్ దేవిదీక్షిత్ అభినందించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన
రాజోలు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కాట్రేనిపాడులో మండల వ్యవసాయశాఖ అధికారి వై.మధుకుమార్ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టంపై రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సమాచార హక్కు చట్టం ద్వారా కలిగే ఉపయోగాలను రైతులకు వివరించారు. ఈసమాచార హక్కు చట్టం ద్వారా రైతులు ఎటువంటి సమాచారాన్ని పొందవచ్చు, చట్టాన్ని ఏవిధంగా ఉపయోగించుకోవాలో తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ సాయికృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ చట్టాలపై అవగాహన సదస్సు
రాజోలు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): చింతలపల్లిలో సర్పంచ్ మట్టాప్రసన్నకుమారి అధ్యక్షతన మంగళవారం పౌర హక్కుల దినోత్సవం జరిగింది. ఈసందర్భంగా ఏవో ఎం.సత్యనారాయణ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ప్రతీ నెలాఖరున ఆయా గ్రామాల్లో సివిల్ రైట్స్ డేను పురస్కరించుకుని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై మండల స్థాయి అధికారులు అవగాహన కల్పించాల్సి ఉండగా సదస్సుకు గైర్హాజరు కావడం పట్ల రాజోలు జేఏసీ కన్వీనర్ మట్టా సురేష్‌కుమార్ అసహనం వ్యక్తం చేశారు. అట్రాసిటీ చట్టాల అవగాహన సదస్సులను విస్మరిస్తున్న అధికారులపై జిల్లా కలెక్టర్‌తో పాటు ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకులు బత్తుల మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు మందపాటి మధు, మెడబల శేఖర్, ఉప సర్పంచ్ బొక్కా రామకృష్ణ, వీఆర్వోలు సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి కె.రజనీ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదుపై నాయకులు దృష్టి పెట్టాలి


అంబాజీపేట: మాచవరంలో సభ్యత్వ కార్యక్రమం నిర్వహిస్తున్న రాంబాబు

మామిడికుదురు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదుపై నాయకులు దృష్టి పెట్టి అత్యధిక స్థాయిలో నమోదు చేయాలని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు పిలుపునిచ్చారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం మొగలికుదురు, అప్పనపల్లి, పాశర్లపూడి గ్రామాల్లో మొల్లేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో రాంబాబు మాట్లాడుతూ పి.గన్నవరం నియోజకవర్గ స్థాయిలో అత్యధిక సభ్యత్వాలు నమోదుచేసి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. నాయకులంతా సైనికుల్లా పనిచేసి అత్యధిక సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. పార్టీ నాయకులు వర్థినేని బాబ్జి, సూదా బాబ్జి, దొంగ సత్తిబాబు, కొండా జగదీష్, అల్లూరి గోపీరాజు, పాటి వెంకట్రావు, సూదా శ్రీను, పాటి గోవిందు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి
అంబాజీపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలని నియోజకవర్గ కన్వీనర్ నామన రాంబాబు సూచించారు. మాచవరంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని క్లస్టర్ ఇన్‌చార్జ్ గణపతి వీరరాఘవులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా నామన రాంబాబు మాట్లాడుతూ టీడీపీ సభ్యత్వ నమోదును నియోజకవర్గంలో అధిక సంఖ్యలో పూర్తిచేసి రాష్ట్రంలో అత్యధిక స్థానంలో పి.గన్నవరం నియోజకవర్గం ఉండే విధంగా కృషిచేయాలన్నారు. దొమ్మేటి శ్యామ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, టీడీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి బొంతు పెదబాబు, ఎస్సీసెల్ నాయకులు చిన్నం బాలవిజయరావు, నాగాబత్తుల వెంకటసుబ్బారావు, పెదపూడి శ్రీనివాసరవు, జిల్లా సాంస్కృతిక విభాగం కార్యదర్శి రవణం రాము, నాయకులు కొప్పినీడి ఈశ్వరరావు, సుంకర గణపతి, దొమ్మేటి తాతారావు పాల్గొన్నారు.

రావులమ్మ అమ్మవారి పంట జాతర
అంబాజీపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కె.పెదపూడి గ్రామదేవత శ్రీరావులమ్మ అమ్మవారి పంట జాతరను మంగళవారం నిర్వహించారు. రెండేళ్లకోసారి అమ్మవారి పంట జాతర నిర్వహిస్తారు. గరగ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవార్ని పురవీధుల్లో ఊరేగించారు.

పొగాకు కొట్టులో చోరీ
పి.గన్నవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం త్రీరోడ్ సెంటర్‌లో గల పొగాకు విక్రయం దుకాణంలో అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి. ప్రధాన పంటకాల్వ వైపు ఉన్న గోడకు రంధ్రం చేసి పొగాకు షాపులోకి చొరబడ్డాడు. విలువైన సిగరెట్ ప్యాకెట్లు, అధిక మొత్తంలో చిల్లర నాణాలు దోచుకు పోయినట్లు షాపు యజమాని తాటికాయల సత్తిబాబు తెలిపాడు. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు షాపు యజమాని తెలిపాడు.

బాలబాలాజీ ఖ్యాతిని పెంపొందిద్దాం
మామిడికుదురు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లి బాలబాలాజీ ఖ్యాతిని మరింత పెంపొందించాలని సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు కోరారు. దేవస్థానంలో జరిగిన పవిత్రోత్సవాలు విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన "ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, నియోజకవర్గ స్థాయి నాయకులు, భక్తులు, అర్చకులు, వేదపండితులు, సిబ్బంది ప్రతీ ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

వెండి మకర తోరణం బహూకరణ

మామిడికుదురు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆదుర్రు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీసర్వమంగళ పార్వతీ విశ్వేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారికి మాజీ సర్పంచ్ ఉపాధ్యాయుల కామేశ్వరి, జగన్నాథశాస్త్రి దంపతులు 8కిలోల బరువు రూ.6లక్షలు విలువైన వెండి మకర తోరణాన్ని బహూకరించారు. అర్చకులు వెంకటేశ్వరశర్మ, సుబ్రహ్మణ్యశర్మ వెండి మకర తోరణానికి సంప్రోక్షణచేసి ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారికి అలంకరించారు. కార్తీకమాసంలో అమ్మవారు వెండి మకర తోరణంతో భక్తులకు దర్శనమిస్తారు.

రూ.20,100 విరాళం
అయినవిల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలానికి చెందిన దొడ్డపనేని భారతి, వారి కుటుంబ సభ్యులు అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. అనంతరం శ్రీవిఘ్నేశ్వర అన్నప్రసాద ట్రస్టుకు రూ.20,100 విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు వేదాశీర్వచనం అందజేసి శేషవస్త్రంతో సత్కరించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను దాతకు అందజేశారు.

రూ.51,111 విరాళం
అంతర్వేది, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు అమలాపురానికి చెందిన అడబాల రాజారావు-నాగకృష్ణకుమారి దంపతులు మంగళవారం రూ.51,111 విరాళం అందజేశారు. ఈవిరాళాన్ని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణకు అందించినట్టు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు, అర్చకులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందించి అభినందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి, కిరణ్, అన్నదానం స్వామి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

అమలాపురం రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఇందుపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి వి.హేమంత్ జాతీయస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైనట్టు పీఈటీ వి.నరసింహారావు మంగళవారం తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో జరిగిన అండర్-17 రాష్ట్రస్థాయి పురుషుల బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా తరఫున హేమంత్ పాల్గొని అద్భుత ప్రతిభ కనబరిచాడు. నవంబరు 17 నుంచి 22 వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో హేమంత్ పాల్గొంటాడు. హేమంత్‌ను హెచ్ఎం వి.శ్రీనివాసరావు, సర్పంచ్ చొల్లంగి శివాళినీఅప్పాజీ, ఎస్ఎంసీ సభ్యులు అభినందించారు.

బ్రాందీ షాపు తొలగించాలి
కాట్రేనికోన, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన గేట్‌సెంటర్ సమీపంలో కొత్తగా ఏర్పాటుచేసిన బ్రాందీ షాపును తొలగించాలని ఆ ప్రాంత కుటుంబాల వారు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వంద కుటుంబాలు నివసిస్తున్న ప్రాంతంలో మద్యం దుకాణం నిబంధనలకు విరుద్ధమన్నారు. బ్రాంది షాపు కారణంగా మహిళలు రోడ్డు మీదకు రాలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. తక్షణం మద్యం షాపును తొలగించి తమకు రక్షణ కల్పించాలని కోరారు. ఎం.గంగాభవాని, డి.శ్యామల, డి.దివ్యశ్రీ, కె.రాంబాబు, ఎం.గంగారత్నం, మల్లాడి శ్రీనివాస్, కె.సత్యకళ్యాణీనాగజ్యోతి, బి.శ్రీలక్ష్మి, బి.గోపాలకృష్ణ, జీఎస్ కుమార్ తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

భార్యాభర్తలపై హత్యాయత్నం
ఐ.పోలవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రెండు కుటుంబాల మధ్య కొబ్బరిచెట్టు వివాదం తలెత్తడంతో హత్యాయత్నానికి దారితీసింది. జి.మూలపొలం పంచాయతీ ఎర్రగరువుకు చెందిన గంజా సత్యనారాయణ, గంజా రాధాకృష్ణ కుటుంబాల మధ్య కొబ్బరి చెట్టు వివాదం తలెత్తింది. గంజా సత్యనారాయణతో పాటు అతని భార్యపై మంగళవారం రాధాకృష్ణ కత్తితో దాడి చేశాడు. దీంతో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వారిని యానాం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దాడికి పాల్పడిన రాధాకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం


డాక్టర్ పి.సౌమ్యను సత్కరించిన బీవీసీ ప్రిన్సిపాల్ రామారావు తదితరులు

అమలాపురం రూరల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి అమలాపురం ఏరియా ఆసుపత్రి మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ పి.సౌమ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు మొబైల్ ఫోన్ల వాడకాన్ని తగ్గించి విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మానసిక ఒత్తిడి, పరీక్షల సమయంలో భయం కలగడం వంటి అంశాలపై డాక్టర్ సౌమ్య విద్యార్థులకు పలు సూచనలు చేశారు. మాదక ద్రవ్యాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. డాక్టర్ రామారావు ఆధ్వర్యంలో సౌమ్యను సత్కరించారు. కార్యక్రమంలో డాక్టర్ సీహెచ్ బాబి, పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు, బి.శేషారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె.దుర్గారావు, ఫిజికల్ డైరెక్టర్ కరాటం రవిసుధీర్, మురళీ పాల్గొన్నారు.

పెరిగిన బెల్ట్ షాపులు: విక్రయాల జోరు
అల్లవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలో బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గతంలో మండలంలో 160కు పైగా బెల్ట్‌షాపులు ఉండగా వాటి సంఖ్య నేడు 210 దాటింది. మరోపక్క బెల్ట్ షాపులు పెట్టుకోవడానికి అవకాశాలు ఇవ్వాలంటూ కొందరు నాయకులు ద్వారా రాజకీయ పైరవీలు సాగిస్తున్నారు. అనధికార మద్యం షాపులు నిర్వహిస్తే రూ.5లక్షలు జరిమానా విధిస్తామని సీఎం చంద్రబాబు హెచ్చరికలు జారీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లోను బెల్ట్‌షాపులను అనుమతించవద్దని చంద్రబాబు సూచించారు. బెల్ట్‌షాపుల ద్వారా మద్యం విక్రయాలు చేపట్టే షాపులకు రూ.5 లక్షలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అల్లవరం, గోడితిప్ప, ఓడలరేవు, కొమరగిరిపట్నం, బెండమూర్లంక, దేవగుప్తం, డి.రావులపాలెం, బోడసకుర్రు, గూడాల, సామంతకుర్రు తదితర గ్రామాల్లో బెల్ట్‌షాపులు ఉన్నాయి. ఓపెన్ బారుల్లా మద్యం అమ్మకాలు జరుగుతున్నా ఎక్సైజ్, పోలీస్ శాఖల దాడులు లేవన్న విమర్శలు వస్తున్నాయి. మద్యం షాపుల నుంచి బెల్ట్‌షాపుల నిర్వాహకులు 30నుంచి 70కిపైగా మద్యం సీసాలు తీసుకుని వెళ్తున్నారు. మద్యం ధరలు తగ్గక మందుబాబులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొలుసుమద్యం దుకాణాలు నియంత్రించాలని మహిళా సంఘాలు కోరుతున్నాయి.

అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేస్తే కేసులు
మామిడికుదురు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా బాణసంచా నిల్వ చేస్తే కేసులు నమోదు చేస్తామని నగరం ఎస్‌ఐ ఎ.చైతన్యకుమార్ హెచ్చరించారు. నగరంలోని మొల్లేటిమెరక ప్రాంతానికి చెందిన మొల్లేటి మోహన్‌సతీష్ దాచిన బాణసంచా సామగ్రిని సోమవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. రూ.35వేలు విలువైన బాణసంచా సామగ్రిని స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదుచేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

నిబంధనల మేరకు విక్రయించాలి
అంబాజీపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నిబంధనల మేరకు అంబాజీపేట, పుల్లేటికుర్రు, ముక్కామల హైస్కూల్ ప్రాంగణాల్లో బాణసంచా విక్రయించుకోవాలని తహశీల్దారు జె.వెంకటేశ్వరి, ఎస్‌ఐ చిరంజీవి సూచించారు. మాచవరం, పుల్లేటికుర్రు, ముక్కామలలో షాపులకు లైసెన్సు మంజూరు చేశామన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత షాపు నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

దుకాణాలకు లైసెన్సు తప్పనిసరి
అల్లవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా బాణసంచా విక్రయాలు నిర్వహించే దుకాణదారులు విధిగా లైసెన్సులు తీసుకోవాలని అల్లవరం ఎస్‌ఐ జి.హరీష్‌కుమార్ అన్నారు. నిబంధనలు పాటిస్తూ నిర్దేశిత ప్రదేశాలలో బాణసంచా విక్రయాలు జరపాలన్నారు. విద్యాసంస్థలు, జనావాసాల మధ్య దుకాణాలు పెట్టవద్దని ఎస్‌ఐ సూచించారు. పొడి ఇసుక, నీటిని అందుబాటులో ఉంచాలన్నారు.

మందుగుండు సామగ్రి స్వాధీనం
అంతర్వేది, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వీవీ మెరక గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా షాపులపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. బాణసంచా విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టుచేసి వారి నుంచి అక్రమంగా నిల్వ ఉంచిన రూ.93,690 విలువైన దీపావళి మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ కుడుపూడి దుర్గాశ్రీనివాస్ తెలిపారు.

నిర్వాసితుల డిమాండ్లు నెరవేరుస్తా
మామిడికుదురు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భవనాలు, భూములు కోల్పోతున్న వారి డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని అమలాపురం ఆర్డీవో కె.మాధవి పేర్కొన్నారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో పాశర్లపూడి, మామిడికుదురు గ్రామాలకు చెందిన రైతులతో సమావేశాన్ని నిర్వహించారు. భూమి దస్తావేజుల్లో తేడాలుంటే వాటిని పరిశీలించి మూడు రోజుల్లో తేడాలను సరిచేస్తామన్నారు. రైతులు కోరుకునే విధంగా పరిహారం ఇవ్వడానికి భవనాల్లో పది శాతం పడిన పూర్తిస్థాయిలో పరిహారం ఇవ్వడానికి, భూముల విషయంలో సెంటుల్లో కాకుండా గజాల్లో ఇవ్వడానికి కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ దృష్టికి తీసుకువెళ్లి రైతులు కోరుకునే విధంగా పరిహారం ఇచ్చేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

జేసీని కలిసిన డీఈవో

అమలాపురం టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్కే సలీం మంగళవారం జాయింట్ కలెక్టర్ టి.నిశాంతిని మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఆయన వెంట ఉప విద్యాఖాధికారి జి.సూర్యప్రకాశం ఉన్నారు.





పారిశుధ్య చర్యలు

అయినవిల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): నేదునూరు గ్రామం పెదపేట కాలనీలో మంగళవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత కోసం బ్లీచింగ్ చల్లించారు. కార్యక్రమంలో సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి మొహమ్మద్ అన్వర్, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రింటర్, ఇన్వర్టర్ అందజేత

పి.గన్నవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం హైస్కూల్‌కు పూర్వ విద్యార్థులైన సోదరులు చినమిల్లి వెంకటరామకృష్ణ, కొండయ్య నాయుడులు మంగళవారం తల్లిదండ్రులు భూజంగరావు, అనంతలక్ష్మి జ్ఞాపకార్థం ప్రింటర్, ఇన్వర్టర్‌ను హెచ్‌ఎం డీఎస్‌వీ ప్రసాద్, లెక్కలు ఉపాధ్యాయుడు జి.అమ్మిరాజులకు అందించారు.

రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలు పరిష్కారం





అలమూరు: బడుగువానిలంకలో రెవెన్యూ సదస్సు, కపిలేశ్వరపురం: వాకతిప్ప సభలో మాట్లాడుతున్న తహశీల్దార్ చిన్నారావు, కె.గంగవరం: కుందూరు సభలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి

అలమూరు, అక్టోబరు 29: రెవెన్యూ సదస్సుల్లో రైతులకు సంబంధించిన భూసమస్యలను వివరించి పరిష్కరించుకోవడానికి వీలుగా ఉందని తహశీల్దార్ కేజే ప్రకాష్‌బాబు అన్నారు. బడుగువానిలంకలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు రైతులు అందించిన భూసమస్యలపై వచ్చిన ఫిర్యాదులను తహశీల్దార్ ప్రకాష్‌బాబు స్వీకరించారు. ఫిర్యాదులను పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని చెప్పారు. పలువురు అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కుందూరులో సదస్సు

కె.గంగవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భూసర్వే వల్ల ఏర్పడిన సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తుందని, ఈసభల్లో రైతుల సమస్యలు పరిష్కారమవుతాయని, సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు అన్నారు. మంగళవారం కుందూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన మాట్లాడారు. తహశీల్దార్ బండి మృత్యుంజయరావు మాట్లాడుతూ రైతులకు భూసర్వే ద్వారా వచ్చిన సమస్యలపై దరఖాస్తులు చేసుకుంటే నిర్ణీత సమయంలో పరిష్కరిస్తామని చెప్పారు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులు స్వీకరించారు. సర్పంచ్ పంపన సత్యానందం, డిప్యూటి తహశీల్దార్ మురళీ, ఆర్ఐ వెంకట్రావు, మండల సర్వేయర్ పావని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చు

కపిలేశ్వరపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ గ్రామసభలను నిర్వహిస్తుందని, రైతులు వాటిని వినియోగించుకోవాలని తహసీల్దార్ పి.చిన్నారావు అన్నారు. మంగళవారం వాకతిప్ప పంచాయతీ కార్యాలయం వద్ద వాకతిప్ప, నాగుల చెరువు సర్పంచ్‌లు కొరిపెల్ల నాగస్రవంతి, వాసంశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. భూసర్వేలో జరిగిన లోపాలున్నట్లయితే రైతులు దరఖాస్తు చేసుకోవాలని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని తెలిపారు. ఈగ్రామసభలో భూసమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. టీడీపీ సీనియర్ నాయకుడు అల్లూరి రామకృష్ణ చౌదరి, వీఆర్‌వో ఉమామహేశ్వరరావు, సర్వేయర్లు, రైతులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బడుగువానిలంక, వాకతిప్ప, కుందూరు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు

ఇళ్లల్లో బాణసంచా నిల్వ చేస్తే చర్యలు




రాయవరంలో బాణసంచా విక్రయ కేంద్రాలను తనిఖీ చేస్తున్న డీఎస్పీ

ద్రాక్షారామ: రామచంద్రపురంలో బాణసంచా దుకాణాలు పరిశీలిస్తున్న సీఐ తదితరులు

రాయవరం, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): ఇళ్లల్లో బాణసంచా నిల్వలు ఉంచితే కఠిన చర్యలు తప్పవని రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ హెచ్చరించారు. మంగళవారం రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జనావాసాల మధ్య ఎవరైనా సొంతానికి మంతాబాబు, చిచ్చుబుడ్లు, ఇతర మందుగుండు సామగ్రి తయారు చేసినా, అక్రమంగా నిల్వ ఉంచినా చర్యలు తప్పవన్నారు. బాణసంచా తయారీ కేంద్రాలతో పాటు లైసెన్సులు పొందిన దుకాణదారులు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ ప్రభుత్వం నిర్దేశించిన స్థలాల్లో అమ్మకాలు జరుపుకోవాలన్నారు. అనుమతులు లేని ప్రదేశాల్లో అమ్మకాలు సాగిస్తే చర్యలు తప్పవన్నారు. తొలుత రాయవరంలో బాణసంచా అమ్మకాలు జరుపుతున్న దుకాణాలను పరిశీలించి తయారీదారులు నిబంధనలు పాటిస్తున్నారా అనే విషయాన్ని ఆరా తీశారు. ప్రజలంతా జాగ్రత్తలు పాటిస్తూ ఆనందంగా దీపావళి జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, ఎస్ఐ బుజ్జిబాబు, ఏఎస్ఐ పి.వెంకటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు పాటించండి

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బాణసంచా విక్రేతలు నిబంధనలుపాటించాలని సీఐ కె.అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలో కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడాప్రాంగణంలో ఏర్పాటుచేసిన బాణసంచా దుకాణాలను సీఐ అశోక్‌కుమార్, అగ్నిమాపకదళ అధికారి నాగేశ్వరరావుపరిశీలించారు. ఈసందర్భంగా బాణసంచా దుకాణాదారులతో మాట్లాడుతూ ప్రతీ దుకాణం వద్ద ఇసుక, నీరు, అగ్నిమాపక పరికరం ఏర్పాటు చేయాలన్నారు.

అనుమతులు లేకుండా విక్రయిస్తే చర్యలు

ఆత్రేయపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు లేకుండా బాణసంచా విక్రయాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ రాము హెచ్చరించారు. మంగళవారం వెలిచేరు సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఆత్రేయపురానికి చెందిన వ్యక్తి వద్ద బాణసంచా తయారీకి మందుగుండు సామగ్రి కలిగి ఉండటంతో సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏడిద ఘటన దురదృష్టకరం

ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఏడిదలో సోమవారం జరిగిన బాణసంచా పేలుడు సంఘటనపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంలో మృతిచెందిన వెంకటకృష్ణ బాధా కరమన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని, గాయపడ్డవారికి మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించామని ఆయన తెలిపారు. ఏడిదలో జరిగిన బణాసంచా పేలుడు సంఘటనపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ప్రమాదంలో వెంకటకృష్ణ మృతిచెందటం బాధాకరమని అన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సేవలకు గుర్తింపుగా పదోన్నతి



శ్రీరామ్‌ను సన్మానిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

కె.గంగవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పాణింగపల్లి వ్యవసాయ శాఖ సహాయకుడిగా పనిచేస్తున్న బండారు శ్రీరామ్ సేవలకు గుర్తింపుగా పదోన్నతి లభించిందని వ్యవసాయ శాఖ రామచంద్రపురం ఏడీఏ ఎస్‌బీఎస్ రంగారావు, కె.గంగవరం ఏవో బలుసు రవి అన్నారు. మంగళవారం పదోన్నతిపై బదిలీ అయిన శ్రీరామ్‌ను వ్యవసాయశాఖ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ పదేళ్లుగా శ్రీరామ్ వ్యవసాయశాఖలో పనిచేస్తూ రైతులకు విశేషసేవలు అందించాడని అన్నారు. అందరూ వీఏఏలు అదేవిధంగా పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల నుంచి వచ్చిన వ్యవసాయశాఖ సహాయకులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహశీల్దార్‌గా శ్రీనివాసన్



రావులపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రావులపాలెం రెవెన్యూ కార్యాలయ డిప్యూటీ తహశీల్దార్‌గా శ్రీనివాసన్ విధుల్లో చేరారు. ఆయన ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో అంబాజీపేట మండలం ఎంఎల్‌సీ పాయింట్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు.

కపిల్‌దేవ్‌ను కలిసిన లీలాకృష్ణ



మండపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భారతక్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ క్రికెట్ దిగ్గజం, కపిల్‌దేవ్ ఎంపీ కేశినేని నానిని కలిసేందుకు సోమవారం విజయవాడ వచ్చారు. ఈసందర్భంగా ఆయనను జనసేన పార్టీ మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ మర్యాదపూర్వకంగా కలిసారు.

ధాన్యం మద్దతు ధరపై రైతులకు అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఏవో ప్రభాకర్

రాయవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వరికి అందిస్తున్న మద్దతు ధరపై రైతులకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో కీర్తి స్పందన ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి సూచించారు. మంగళవారం రాయవరం మండల ప్రజాపరిషత్ సమావేశపు హాల్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏవో కె.ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో కీర్తి స్పందన, జిల్లా వనరుల కేంద్రం నుంచి వచ్చిన వ్యవసాయ అధికారి జె.మనోహర్ మాట్లాడుతూ ప్రతి రైతు సేవా కేంద్రాల్లో గోను సంచులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, తేమ శాతం 17లోపు ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఏవో ప్రభాకర్ మాట్లాడుతూ వరికి సాధారణ రకం 75కిలోలు రూ.1725, ఏగ్రేడ్ సన్న రకాలకు 75కిలోలు రూ.1740గా మద్దతు ధర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. డిప్యూటీ తహశీల్దారు ఐ.సంధ్య, వ్యవసాయ విస్తీర్ణ అధికారి ఎ.శివశంకర్, మండలంలోని 19 రైతు సేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

మండపల్లిలో బాట పేరుతో మట్టి అక్రమ తవ్వకాలు

- అడ్డుకుని తప్పుకున్న రెవెన్యూ అధికారులు
- విచారణ చేస్తానన్న కొత్తపేట ఆర్డీవో



మండపల్లిలో బాటపేరుతో మట్టి అక్రమ తవ్వకాలు నిర్వహిస్తున్న దృశ్యం

కొత్తపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ఆలమూరు-2 అనధికార మండపల్లి ఇసుకర్యాంపులో బాట పేరుతో కొందరు అక్రమార్కులు మట్టి తవ్వకాలు చేపట్టారు. వందలాది లారీలను ఇటుక బట్టీలకు రవాణా చేస్తూ సొమ్ములు చేసుకుంటున్నారు. దీనిపై స్థానిక రెవెన్యూ అధికారులకు వచ్చిన ఫిర్యాదుల మేరకు సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని అడ్డుచెప్పి ఆపై తప్పుకోవడం వెనుక అధికారపార్టీ నాయకుల బెదిరింపులు కారణమని తెలిసింది. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జేసీ నిషాంతి సైతం ఇసుక తవ్వకాలకు సంబంధించి ఈ ర్యాంపును పరిశీలించినప్పటికీ అధికారపార్టీ అండదండలతో అనుమతులు లేకుండా ర్యాంపును నిర్వహించేందుకు సన్నాహాలు చురుగ్గా సాగుతున్నాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎవరి అనుమతులు లేకపోయినప్పటికీ ఈ ర్యాంపు బాట నిర్వహణ పేరుతో మట్టిని ఎక్స్‌కవేటర్‌తో తరలించేస్తున్నారు. దీనికి సంబంధించి అధికారికంగా పర్యావరణ అనుమతులు, మైనింగ్ అనుమతులు లేకపోయినప్పటికీ మట్టి తవ్వకాలు చేపట్టడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కొత్తపేట ఆర్డీవో శ్రీకర్‌ను వివరణ కోరగా విచారణ చేస్తానని తెలిపారు.

దివ్యాంగుల దరఖాస్తుల స్క్రీనింగ్

ద్రాక్షారామ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): 18ఏళ్లలోపు దివ్యాంగులకు ఉపకరణాలు అందించేందుకు చేసుకున్న దరఖాస్తులను బెంగళూరు అలిమ్కో సంస్థ మంగళవారం ఎంఈవో కార్యాలయంలో స్క్రీనింగ్ చేశారు. గత మార్చి నెలలో జిల్లా వ్యాప్తంగా చేసుకున్న 368 దరఖాస్తులను సోమ, మంగళవారాల్లో స్క్రీనింగ్ జరిపారు. అర్హులకు 2024-25 అకడమిక్‌లో అవసరమైన ఉపకరణాలు అందజేస్తామని అలిమ్కో సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, ఏఎంవో రాంబాబు, మండలాల ఐఈఆర్టీలు, ఎంఈవో ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుందూరు, భట్లపాలికలలో టీడీపీ సభ్యత్వ నమోదు



కుందూరులో పార్టీ సభ్యత్వం చూపిస్తున్న టీడీపీ నాయకులు

కె.గంగవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు మేడిశెట్టి రవికుమార్, సలాది రమేష్‌ల ఆధ్వర్యంలో కుందూరు, భట్లపాలిక గ్రామాల్లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పార్టీ నాయకు లు నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు సభ్యత్వం తీసుకోవడంవల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కార్యకర్తలతో సభ్యత్వ నమోదు చేయించా రు. ఈ కార్యక్రమాల్లో పార్టీ నాయకులు జగతా రమణ, పర్తంశెట్టి గోవిందు, ఆంజనేయులు, మేడిశెట్టి బాబి, సుంకర శ్రీనివాసరావు, మేకా శ్రీని వాస్, ముషిణి ఆనందరావు, పల్ల వెంకటరెడ్డి నాయుడు, చెల్లి వీరబాబు, చిర్రా సురేష్, కొరిపెల్ల సురేష్ పాల్గొన్నారు.

సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని జరుపుకున్నారు.పొలిటికల్ సైన్సు అధ్యాపకులు కె.రవిబాబు విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సర్దార్ వల్లబాయిపటేల్ జీవిత విశేషాల గురించి ప్రిన్సిపాల్ ఎన్.శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ పద్మజా వివరించారు. విద్యార్థులు మానవహారం, ర్యాలీ నిర్వహించారు.

డిప్యూటీ తహశీల్దార్‌గా శ్రీరామ్‌ప్రసాద్

కె.గంగవరం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం మండలం డిప్యూటీ తహశీల్దార్‌గా పి.శ్రీరామ్‌ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఆలయన కపిలేశ్వరపురం మండలం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు.

అరకొర నిబంధనలతో షాపుల ఏర్పాటు

రావులపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణాలు ఏర్పాటు సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే చిన్నపాటి అగ్ని ప్రమాదం జరిగినా పెనుప్రమాదంగా మారే అవకాశం ఉంది. దీనికోసం అధికారులు ప్రత్యేక నిబంధనలు పాటించాలంటూ షాపు నిర్వాహకులకు సూచనలు చేస్తుంటారు. షాపుల ఏర్పాటు సమయంలో పూర్తిస్థాయిలో నిబంధనలు పాటించకుండా షాపులు ఏర్పాటుచేసి విక్రయాలు సాగిస్తున్నా ముందస్తుగా హెచ్చరికలు జారీ చేసిన అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై పలు విమర్శలకు తావిస్తోంది. రావులపాలెం ప్రభుత్వ కళాశాలల క్రీడా ప్రాంగణానికి సమీపంలో 33 బాణసంచా దుకాణాలు ఏర్పాటుచేశారు. ఈ దుకాణాల ఏర్పాటు సమయంలో పూర్తి స్థాయిలో నిబంధనలు పాటించకుండా దుకాణాలు ఏర్పాటు చేశారని పలువురు విమర్శిస్తున్నారు. అధికారులు దుకాణాలను పరిశీలించి పూర్తి స్థాయిలో నిబంధనలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బాణసంచా తయారీపై కేసు నమోదు

ద్రాక్షారామ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆదివారపుపేటలో అనుమతులు లేకుండా బాణసంచా తయారీ చేస్తున్న మహిళపై ద్రాక్షారామ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఆదివారపుపేటలో తనిఖీ చేయగా సాదె కాంతమ్మ అనే మహిళ తాటాకు టపాకాయలు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఆమెవద్ద నుంచి 250 టపాకాయలు స్వాధీనం చేసుకుని ఎస్ఐ లక్ష్మణ్ కేసు నమోదు చేశారు.

బాణసంచా క్షతగాత్రులకు మంత్రి పరామర్శ

జీజీహెచ్ (కాకినాడ) అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): డా.బీఆర్.అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేట మండలం ఏడిద గ్రామంలో సోమవారం జరిగిన బాణసంచా పేలుడు ఘటనలో తీవ్ర గాయాలపాలై కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ మంగళవారం పరామర్శించారు. ఈ దురదృష్టకరమైన సంఘటనలో ఒకరు మృత్యువాత పడడంపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. జీజీహెచ్, బర్న్స్ వార్డులో చికిత్స పొందుతున్న కల్లు జయశ్రీని పరామర్శించి మెరుగైన వైద్య సేవలు అందించాలని డా.శివకుమార్ బృందాన్ని కోరారు. మంత్రి మాట్లాడుతూ దీపావళి పండుగ నేపథ్యంలోప్రజలు మందుగుండు సామాగ్రితో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆనందదాయకంగా చేసుకునే పండుగ ఒక కుటుంబంలో విషాదం నెలకొనడం బాధాకరమన్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకుని దీపావళి పండుగను ఇంటిళ్ల పాది సంతోషంగా నిర్వహించుకోవాలి ఆకాంక్షించారు. మంత్రి వెంట ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డా.శ్రీనివాసన్, సీఎస్‌ఆర్‌ఎంవో డాక్టర్ కోనాల అనిత, సర్జరీ హెచ్‌వోడీ డా.శ్రీనివాసరావు, డా.శివకుమార్, సీఎంవో డా.లావణ్య ఉన్నారు.

వెంకటరత్నం సేవలు మరువలేనివి

ఆలమూరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం పెదపళ్ల పీహెచ్‌సీలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన పి.వెంకటరత్నం సేవలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. పెదపళ్ల పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో వెంకటరత్నం దంపతులను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా సీహెచ్‌వోగా ఆయన చేసిన సేవలు చిరస్థాయిగా గుర్తుండిపోతాయన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సాయికిశోర్, వైద్య సిబ్బంది ఎన్.సత్యకుమార్, సీహెచ్ వెంకటేశ్వరరావు, ఏవీవీ రాజాఅక్కల ఎం.శ్రీనివాసరావు, పి.ఉమ, వి.రమణ, వి.సుబ్బారావు, ఎస్.సురేష్, డి.సుగుణలక్ష్మి, ఆర్.రాజారమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

కొత్తపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కొత్తపేట విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేపీ రాజు అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఎల్‌సీఎం ఐకేర్ అమలాపురం వారి సౌజన్యంతో విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ ఆధారిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల ఆధారంగా విద్యార్థులకు సూచనలు చేశారు. డాక్టర్ బీసీహెచ్ పాపారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కొత్తపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సెమినార్ హాలు నందు ఆధునిక సమాజంలో పోలీస్ పాత్ర అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు జిల్లాస్థాయి పోటీలలో ప్రవేశం ఉంటుందని ప్రిన్సిపాల్ కేపీ రాజు తెలిపారు.

రన్నింగ్ పోటీల్లో జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ

రావులపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రావులపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల రన్నింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ జీవీ రమణ తెలిపారు. ఈనెల 25న కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరచడంతో జాతీయస్థాయికి ఎంపికయ్యార న్నారు. దీంతో విద్యార్థులను కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కనికిరెడ్డి, సెక్రటరీ కొవ్వూరి నరేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

బెల్ట్ షాపులపై దాడి



రావులపాలెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండలంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ సీఐ కాత్యాయని సిబ్బందితో దాడి చేశారు. దేవరపల్లిలో నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై దాడిచేసి 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.